thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 163 | జగిత్యాల శుక్రవారం 18 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

**కొచ్చి వేదికగా అక్టోబర్‌లో మెగా ఆక్షన్ నిర్వహణ..**




11

## థర్డ్ ఫ్రంట్ దిశగా చర్చలు

- ప్రాంతీయ పార్టీల అధినేతలతో కనిమొళి వరుస భేటీలు
- ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్, సుప్రియా సూలేలతో సమావేశాలు
- త్వరలో మమతా బెనర్జీతో భేటీ అయ్యే అవకాశం

4



## గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తెలంగాణ

- డిసెంబర్ నుంచి హార్వర్డ్ వర్సిటీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సు
- యూకే బిజినెస్ స్కూల్స్ బృందంతో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 17 :

ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో ఔత్సాహికులకు ఎగ్జిక్యూటివ్

మిగతా 3వ పేజీలో..



# ఇది ప్రజా చైతన్యాన్ని రగిలించిన నేల



- ఎందరో యోధులకు పుట్టినిల్లు తెలంగాణ
- రాచరిక పాలనకు విముక్తి కలిగిన సెప్టెంబర్ 17
- ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం
- ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 17, చురకలు :

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు.. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులందరికీ ఈ చారిత్రక సందర్భంగా ఘనంగా నివాళులు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని, నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు అని పేర్కొన్నారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించిందన్నారు. తెలంగాణ పబ్లిక్ గార్డెన్స్‌లో గురువారం ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సుదీర్ఘ పోరాట చరిత్రలో

మిగతా 3వ పేజీలో..





## భూముల లెక్కలపై అఫిడవిట్ అస్త్రం

- కేసీఆర్ కుటుంబ భూములపై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు
- 1954 నుంచే వందల ఎకరాలు ఉన్నాయన్న కేటీఆర్ వ్యాఖ్యలు
- 2004 అఫిడవిట్‌లో కేసీఆర్ పేరిట సున్నా ఎకరాలు
- అఫిడవిట్ వివరాలతో కాంగ్రెస్ కొత్త ప్రశ్నలు
- ఉమ్మడి కుటుంబ ఆస్తులేనంటున్న బీఆర్ఎస్ మద్దతుదారులు
- విచారణ నివేదికకు ముందే ముదురుతున్న రాజకీయ వివాదం

2

## ఎర్రవల్లి భూములపై యాక్షన్‌లోకి రెవెన్యూ టీమ్



2

- మర్కుక్ తహసీల్ కార్యాలయంలో పాత ఫైల్స్ పరిశీలన
- త్వరలో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు?

## హైదరాబాద్ విమోచనం చరిత్రాత్మక ఘట్టమే



2

- ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్
- సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా విమోచన దినోత్సవం
- ఆకట్టుకున్న కేంద్ర బలగాల కవాతు



2

## నిజాం మంచోడైతే తిరుగుబాటు ఎందుకో?



## మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

- ఉప్పల మల్హార్ కుటుంబానికి మంజూరు చేసిన సూర్యాపేట కలెక్టర్
- ఉత్తర్వుల ప్రతులు అందజేసిన కలెక్టర్ పవార్

2

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు షెడ్యూల్

- రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 2027లో ముగియనున్న పదవీకాలం
- మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గాలకు కొత్త జాబితా
- సెప్టెంబరు 28న నోటిఫికేషన్.. నవంబరు 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నవంబరు 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

4






## పేదల ఇళ్ల స్థలాలపై ప్రత్యేక దృష్టి

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి
- కబ్జాలోని ప్రభుత్వ భూములు గుర్తించి పేదలకు అందిస్తాం

హైదరాబాద్/కూసుమంచి, సెప్టెంబర్ 17:

ఇళ్ల స్థలాలు కావాలని అనేకమంది పేదలు ప్రభుత్వాన్ని కోరుతున్నారని, పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండల కేంద్రంలో గురువారం

మిగతా 3వ పేజీలో..

## వైష్ణవి హత్య కేసు నిందితుడు హరిబాబు దారుణ హత్య

- నిజామాబాద్ రాజారాజేంద్ర చౌరస్తా వద్ద నడిరోడ్డుపై దాడి
- కొబ్బరికాయలు కోసే కత్తులతో దాడి చేసిన ముగ్గురు దుండగులు
- సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయిన హరిబాబు
- వైష్ణవి సోదరుడు సంతోష్ వీడియోలో హత్యకు బాధ్యత ప్రకటించినట్లు సమాచారం
- ప్రతీకార హత్య కోణంలోనూ పోలీసుల దర్యాప్తు

2



## ఓటర్ల నోటీసుల పరిష్కారం మరింత సులభతరం



3



## సెప్టెంబరు 17 ముమ్మాటికీ విమోచన దినమే

2

- నిజాంను కీర్తించడం కాంగ్రెస్, బీఆర్ఎస్ కపట నాటకం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

# ఎర్రవల్లి భూములపై యాక్షన్‌లోకి రెవెన్యూ టీమ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, చురకలు :**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ భూముల వ్యవహారం రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూములపై నెల రోజుల్లో లెక్కలు తేల్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ వేదికగా అధికారులను ఆదేశించిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు పాత రికార్డులను వెలికితీసి పరిశీలిస్తున్నారు. కలెక్టరేట్ నుంచి ఏడీ సుదర్శన్ మర్కుక్ చేరుకోగా ఆర్డీవో చంద్రకళ కూడా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఇదే వ్యవహారంపై త్వరలో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చే యోచనలో రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఎర్రవల్లి, వెంకటపూర్ పరిధిలోని భూముల వ్యవహారం స్టేట్ పాలిటిక్స్‌లో చర్చనీయాంశంగా మారింది.

**ఫైల్స్ బయటకు.. సర్వే నంబర్ల పరిశీలన**

మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలోని పాత ఫైల్స్‌ను అధికారులు పరిశీలిస్తున్నారు. ఎర్రవల్లి, వెంకటపూర్, వరదరాజ్‌పూర్ గ్రామాలకు సంబంధించిన సర్వే నంబర్లు, భూముల రికార్డులను పరిశీలిస్తూ వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ భూములు, పట్టా భూములకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. సుమారు 385 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. భూముల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకునేందుకు సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. గూగుల్ ఎర్త్‌లోని పాత శాటిలైట్ చిత్రాలను పరిశీలిస్తూ వాస్తవాలేంటో బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.




# వైష్ణవి హత్య కేసు నిందితుడు హరిబాబు దారుణ హత్య

**నిజామాబాద్, సెప్టెంబరు 17, చురకలు:**

నిజామాబాద్ నగరంలోని రాజారాజేంద్ర చౌరస్తా వద్ద కోరుట్లకు చెందిన హరిబాబు దారుణ హత్యకు గురయ్యాడు. ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు కొబ్బరికాయలు కోసే కత్తులతో దాడి చేయడంతో తీవ్ర గాయాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. గత ఏడాది యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో హరిబాబు ప్రధాన నిందితుడిగా ఉండటం, ఇటీవలే బెయిల్‌పై విడుదల కావడంతో ఈ ఘటన కలకలం రేపింది.

**ప్రేమ పెళ్లి.. ఎనిమిది నెలలకే భార్య హత్య**

జగిత్యాల జిల్లా మాదాపూర్‌కు చెందిన యూట్యూబర్ వైష్ణవిని హరిబాబు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల అభ్యంతరాలను పక్కనబెట్టి అత్తవారింట్లో కాపురం పెట్టినప్పటికీ, ఎనిమిది నెలలకే మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో వైష్ణవిని హత్య చేసిన కేసులో హరిబాబు అరెస్టై జైలుకు వెళ్లాడు. ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయనపై దాడి జరిగింది.

**నడిరోడ్డుపై కత్తులతో దాడి**

రాజారాజేంద్ర చౌరస్తా వద్ద హరిబాబును అడ్డుకున్న ముగ్గురు వ్యక్తులు వెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర రక్తస్రావంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) మార్చురీకి తరలించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**వైష్ణవి సోదరుడి వీడియోతో కొత్త మలుపు**

హరిబాబు హత్య అనంతరం వైష్ణవి సోదరుడు సంతోష్ సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియో కలకలం రేపింది. తన చెల్లిని హత్య చేసిన హరిబాబును తానే అంతం చేసినట్లు సంతోష్ వీడియోలో ప్రకటించినట్లు సమాచారం. చెల్లి హత్యకు ప్రతీకారంగానే ఈ నిర్ణయం తీసుకున్నాని, ఏ ఆడబిడ్డకు ఇలాంటి అన్యాయం జరగకూడదని పేర్కొన్నాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోతున్నట్లు తెలిపాడు. వైష్ణవి 2025 సెప్టెంబరు 17న హరిబాబు చేతిలో హత్యకు గురైనట్లు కేసు నమోదైంది. ఏడాది తర్వాత అదే తేదీన హరిబాబు హత్యకు గురికావడం ఈ ఘటనకు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. పోలీసుల దర్యాప్తులో హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.



# మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

**సూర్యాపేట, సెప్టెంబర్ 17, చురకలు:**

సూర్యాపేట నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రజా ఉద్యమ నాయకుడు ఉప్పల మల్సూర్ కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయింది. ఆయన కుటుంబ పరిస్థితులపై వచ్చిన వార్తలను పరిశీలించిన కలెక్టర్ తేజస్ నంద్లల్ పవార్ మోతె మండలం సిరికొండ గ్రామంలోని మల్సూర్ కుటుంబాన్ని గురువారం స్వయంగా సందర్శించారు. మల్సూర్ ఇంటిని, అక్కడి పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మల్సూర్ కోడళ్లు పుష్పలత, యశోదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్ ప్రతులను కలెక్టర్ స్వయంగా అందజేశారు. కుటుంబ సభ్యుల ప్రస్తుత పరిస్థితులను పరిశీలించిన అనంతరం వారి అర్హతల మేరకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**అంగన్ వాడీ కేంద్రం మరమ్మతులకు రూ.3 లక్షలు**

అనంతరం సిరికొండలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనం మరమ్మతుల కోసం రూ.3 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని అధి కారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీవో సందీప్‌కుమార్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# భూముల లెక్కలపై అఫిడవిట్ అస్త్రం

**హైదరాబాద్, సెప్టెంబరు 17, చురకలు:**

తెలంగాణ శాసనసభలో మొదలైన భూముల వివాదం తాజాగా కేసీఆర్ 2004 ఎన్నికల అఫిడవిట్ చుట్టూ తిరుగుతోంది. కేసీఆర్ కుటుంబానికి 1954 నుంచే వందలాది ఎకరాల భూములు ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా.. కాంగ్రెస్ వర్గాలు పాత అఫిడవిట్‌ను బయటపెట్టాయి. అందులో కేసీఆర్ పేరిట వ్యవసాయ, వ్యవసాయేతర భూములు సున్నా ఎకరాలుగా నమోదై ఉన్నాయని పేర్కొంటూ కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

**అఫిడవిట్‌పై కాంగ్రెస్ ప్రశ్నలు**

2004 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ సమర్పించిన అధికారిక అఫిడవిట్‌లో వ్యవసాయ భూమి, వ్యవసాయేతర భూమి రెండూ 0 ఎకరాలుగా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. 1954 నుంచే వందలాది ఎకరాల జమీందారీ ఆస్తులు ఉన్నాయని కేటీఆర్ చెప్పిన నేపథ్యంలో.. 2004 నాటికి కేసీఆర్ పేరిట సొంత భూములు లేవని ఎందుకు పేర్కొన్నారని ప్రశ్నిస్తున్నారు. కేటీఆర్ చెప్పిన వివరాలు నిజమా? ఎన్నికల అఫిడవిట్‌లోని వివరాలు నిజమా? అంటూ టీపీసీసీ నేతలు నిలదీస్తున్నారు.

**రాజకీయంగా వేడెక్కుతున్న వివాదం**

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఎర్రవల్లి ఫామ్‌హౌస్, సిద్దిపేట పరిసరాల్లోని 440 ఎకరాల భూములపై లెక్కలు ప్రస్తావించిన తర్వాత ఈ వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానం చెప్పే క్రమంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు ఆ పార్టీకి కొత్త అస్త్రంగా మారాయని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. 2004లో సున్నా ఎకరాలు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్న కేసీఆర్ కుటుంబానికి 2026 నాటికి వందలాది ఎకరాల భూములు, ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయనే ప్రశ్నను కాంగ్రెస్ ముందుకు తెస్తోంది.

మరోవైపు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో భూములు కుటుంబ పెద్దల పేరిట ఉండటం సాధారణమని బీఆర్ఎస్ మద్దతుదారులు వాదిస్తున్నారు. 2004 నాటికి కేసీఆర్ పేరిట ప్రత్యేకంగా రిజిస్టర్ కాని పిత్రార్జిత ఆస్తులు అఫిడవిట్‌లో నమోదై ఉండకపోవచ్చని చెబుతున్నారు. కేటీఆర్ ప్రస్తావించింది పూర్వీకుల కాలం నాటి ఆస్తులేనని, కాంగ్రెస్ సగం సమాచారంతో ప్రచారం చేస్తోందని సోషల్ మీడియా కార్యకర్తలు కౌంటర్ ఇస్తున్నారు. ఈ అంశంపై బీఆర్ఎస్ అగ్రనేతల అధికారిక స్పందన ఇంకా వెలువడలేదు. కేసీఆర్ కుటుంబ ఆస్తుల చుట్టూ సాగుతున్న ఈ వివాదం.. అసెంబ్లీ నుంచి ప్రెస్‌మీట్లు, పాత అఫిడవిట్ల పరిశీలన వరకు విస్తరించింది. ఫామ్‌హౌస్ భూములపై 30 రోజుల విచారణ నివేదిక వచ్చేలోపు కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు మరింత తీవ్రం కానున్నాయి.

# సెప్టెంబరు 17 ముమ్మాటికీ విమోచన దినమే

- నిజాంను కీర్తించడం కాంగ్రెస్, బీఆర్ఎస్ కపట నాటకం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, చురకలు :**

నిజాం నిరంకుశ పాలనను, రజాకార్ల అకృత్యాలను కీర్తిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న రాజకీయాలు సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మండిపడ్డారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవ, 'ఆపరేషన్ పోలో' వల్లే హైదరాబాద్‌కు విముక్తి లభించిందని గుర్తు చేశారు. హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా మల్కాజ్‌గిరిలో పటేల్ విగ్రహానికి ఆయన ఘన నివాళులర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరైన అధికారిక విమోచన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ చరిత్రకు సంబంధించిన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని బీజేపీ దశాబ్దాలుగా పోరాడిందని గుర్తుచేశారు. ఓటు బ్యాంకు రాజకీయాలు, ఎంఐఎం ఒత్తిడి కారణంగా గత ప్రభుత్వాలు ఈ చారిత్రక దినాన్ని విస్మరించాయని, కానీ అమరుల త్యాగాలను గౌరవిస్తూ నరేంద్ర మోదీ సర్కార్ 2022 నుంచి అధికారికంగా ఈ వేడుకలను నిర్వహిస్తోందని ఆయన స్పష్టం చేశారు. బీఆరఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ చారిత్రక దినాన్ని 'విలీన దినోత్సవం'గా పేర్కొనడం అత్యంత సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా హైదరాబాద్ సంస్థాన ప్రజలు చేసిన రక్తతర్పణాన్ని, పోరాటాన్ని కేవలం విలీనం అనే పదంతో కుదించలేమన్నారు. భవిష్యత్ తరాలకు ఈ చరితార్థుల త్యాగాలు, పోరాట సత్యాలు తెలియాలంటే ఈ ఘట్టాన్ని పాఠ్యపుస్తకాల్లో సముచితంగా చేర్చాలని డిమాండ్ చేశారు. నిన్న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గతంలో కేసీఆర్.. నిజాం పాలనను కీర్తించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. అమాయకులను



పొట్టనబెట్టుకున్న పరకాల ఊచకోతను, బైరాన్‌పల్లి నరమేధాన్ని, నిజాంరజాకార్ల కాలంలో మహిళలపై జరిగిన అకృత్యాలను వారు ఎలా మరిచిపోయారని నిలదీశారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కలవడానికి నిరాకరించిన నిజాం, హైదరాబాద్‌ను 'ఉస్మానిస్తాన'గా మార్చాలని, పాకిస్తాన్‌లో కలపాలని కుట్రలు పన్నాడని పేర్కొన్నారు. రాంజీ గోండ్ నుంచి స్వామి రామానంద తీర్థ వరకు ఎందరో జాతీయవాదులు "వందేమాతరం" నినాదంతో పోరాడారని గుర్తుచేశారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దృఢమైన నాయకత్వంలో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' కారణంగానే నిజాం లొంగిపోయాడని, 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ భారత యూనియన్‌లో అంతర్భాగమైందని ఆయన ఉద్ఘాటించారు. అలాంటి మహనీయుడైన సర్దార్ పటేల్‌కు దక్కాల్సిన గౌరవాన్ని ఇవ్వడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సంకోచించడం సిగ్గుచేటని విమర్శించారు. ఇదే సందర్భంలో దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ, చరిత్ర విస్మరించిన వీరులకు సముచిత గుర్తింపునిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

# హైదరాబాద్ విమోచనం చరిత్రాత్మక ఘట్టమే

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, చురకలు :**

సరిగ్గా 78 సంవత్సరాల కిందట ఆపరేషన్ పోలో చర్యతో 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో విలీనం చరిత్రాత్మకమైన ఘట్టం జరిగిందని ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ తెలిపారు. సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన హైదరాబాద్ విమోచన దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. యేటా మనమందరం హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ విమోచనం కోసం పోరాడిన ఎంతోమంది వీరులను స్మరించుకునేందుకు, వారి వీరగాథలు భవిష్యత్తు తరాలకు తెలియజేసేందుకు 2022 నుంచి ఈరోజును కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకుంటున్నామన్నారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి బ్రిటిషర్ల నుంచి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ అనేక సంస్థానాల విషయంలో సందిగ్ధత కొనసాగిందన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవతో ఆ సంస్థానాలన్నీ భారత దేశంలో విలీనమయ్యాయని, అందులో హైదరాబాద్ సంస్థానం కూడా ఒకటి అని గుర్తు చేశారు. పటేల్ ఎంతో ముందుచూపుతో ఈ బాధ్యతను భుజాన వేసుకుని సమర్థవంతంగా నిర్వర్తించి వేలాది సంస్థానాలను భారత దేశంలో విలీనం చేశారన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు నిజాం రాజు నిరాకరించడంతో ఆపరేషన్ పోలో చర్య జరపాల్సి వచ్చిందని, అనంతరం నిజాం సైన్యం లొంగిపోవడంతో హైదరాబాద్ సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న విలీనం చేశారని చెప్పారు. ఈ విషయంలో సర్దార్ వల్లభ్ భాj□YT పాత్ర మరువలేనిదన్నారు. హైదరాబాద్ వంటి సంస్థానాలను విలీనం చేసి సర్దార్ పటేల్ దేశాన్ని ఉక్కు మాదిరి దృఢంగా నిర్మించారని కొనియాడారు. గాంధీ, నేతాజీ సుభాష్ చంద్ర బోస్ స్వాతంత్ర్యం రావడంలో ఎంత కీలక పాత్ర పోషించారో భారతదేశాన్ని ముక్కలు కాకుండా కాపాడటంలో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అంతే కీలకపాత్ర పోషించారన్నారు. 19471948 మధ్యకాలంలో భారతదేశ నిర్మాణంలో కేంద్ర బలగాలు ఎంతో కృషి చేశాయన్నారు. నక్సల్ రహిత భారత్‌గా, ప్రతి రాష్ట్రం శాంతిభద్రతల సమస్యలు లేకుండా ప్రశాంతంగా ఉండాలన్నది ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. ఇందులో భాగంగా నక్సలిజం నిర్మూలనలో కూడా ఈ బలగాలు ఎంతో కీలక పాత్ర పోషించాయన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో, ఆయన పర్యవేక్షణలో వామపక్ష తీవ్రవాదమైన నక్సలిజం దేశంలో అంతమైందన్నారు. ఇటీవల చత్తీస్‌గఢ్‌లో నక్సలిజం పూర్తిగా కనుమరుగైన తర్వాత ఎంతో అభివృద్ధి జరుగుతోందన్నారు. దీంతో రాష్ట్రంలోని యువతకు ఎన్నో ఉపాధి అవకాశాలు వస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది విద్యార్థులు, ప్రజలు తమ ప్రాణాలను త్యాగం చేశారని, రాంజీ గోండు, కుమ్రం భీం, తుర్రేబాజ్ ఖాన్ వంటి ఎందరో గొప్ప వారి త్యాగాల వల్లే తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పారు. భూభాగాన్ని కలుపుకొన్నంత మాత్రాన దేశ సమైక్యత నిలవదు.. దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు, సమాన హక్కులు, సమాన గౌరవం కల్పిస్తేనే సమైక్యత బలపడుతుంది అని ఆయన ఉద్ఘాటించారు. వేర్వేరు భాషలు, వేర్వేరు దేవుళ్లను పూజించినా.. వేర్వేరు అభిప్రాయాలు ఉన్నా అందరినీ మన రాజ్యాంగం ఒక్కటిగా చూస్తున్నదని చెప్పారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యేందుకు నిజాం పాలనలోని రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిని వీరులందరికీ అలాగే సర్వార్ వల్లభ్ భాయ్ పటేల్‌కు నా శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నానని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత పరేడ్ గ్రౌండ్స్‌లోని వార్ మెమోరియల్ వద్ద 'రీత్ సెర్మనీ' (పుష్పగుచ్ఛం ఉంచే కార్యక్రమం) ద్వారా దేశం కోసం ప్రాణాలర్పించిన యుద్ధ వీరులకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కిషన్‌రెడ్డిలు నివాళు□ర్పించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, బండి సంజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర సాయుధ బలగాల గౌరవ వందనాన్ని వారు స్వీకరించారు. కేంద్ర బలగాలు నిర్వహించిన కవాతు ఎంతో ఆకట్టుకుంది.

# నిజాం మంచోడైతే తిరుగుబాటు ఎందుకో?

- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, చురకలు :**

రజాకార్ల కిరాతకాల నుంచి రక్షణ కోసం పల్లెపల్లెనా ప్రజలు బురుజులు ఎందుకు కట్టుకున్నారో అసెంబ్లీ సాక్షిగా నిజాంను కీర్తించిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఓటు బ్యాంకు దాహంతో, మజ్లిస్ పార్టీకి సాగిలపడి నిజాం నిరంకుశత్వాన్ని గొప్ప పాలనగా చిత్రీకరిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నైజంపై కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. నిన్న అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి నిజాంను వెనుకేసుకొస్తూ మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీలో నిజాం పాలనను సమర్థించిన తీరును తప్పుపడుతూ నిజాం పాలన అంత గొప్పదైతే ప్రజాకవి బండి యాదగిరి 'బండి వెనుక బండి కట్టి ఏ బండిల వస్తావు కొడకా నైజాం సర్కరోడా' అంటూ నిజాం సర్కారుకు వ్యతిరేకంగా ఎందుకు గళమెత్తాల్సి వచ్చిందని సూటిగా ప్రశ్నించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా విచ్చేసి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి ఘన నివాళులర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సాయుధ బలగాల కవాతు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలకు విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే రోజు జన్మదినం జరుపుకుంటున్న దేశ ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మోదీకి భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల కిరాతక మారణకాండకు వ్యతిరేకంగా పోరాడిన అమరులకు, స్వాతంత్ర్య సమరయోధులకు ఈ వేదికపై నుంచి ఆయన ఘన నివాళులర్పించారు. నిజాం, రజాకార్లు సాగించిన దౌర్జన్యాలు, మారణహోమం, దేవాలయాలపై దాడులు, ప్రజల కష్టాలను అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం, మజ్లిస్ పార్టీకి భయపడి తొక్కిపెట్టే ప్రయత్నం చేశాయని తీవ్రంగా మండిపడ్డారు. నిజాంను గొప్పవాడిగా కీర్తించడం బాధాకరమని అన్నారు. నిజాం పాలన అంత గొప్పదైతే వందేమాతరం రామచంద్రరావు, భాగ్యరెడ్డి వర్మ, కొమరం భీమ్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది మహానుభావులు నిజాం అణచివేతకు వ్యతిరేకంగా ఎందుకు పోరాడాల్సి వచ్చింది.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు రజాకార్ల కిరాతకాల నుండి రక్షణ కోసం తమ గ్రామాల్లో బురుజులు ఎందుకు కట్టుకోవాల్సి వచ్చింది.. స్వతంత్ర భారతంలో భారత సైన్యం నిజాంపై ట్యాంకర్లతో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది అని ప్రశ్నించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'వందేమాతరం' పాడుతూ ఉద్యమం చేసిన వందేమాతరం రామచంద్రరావుని ఆనాడు నిజాం ప్రభుత్వం మతపరమైన గేయమని నిషేధించినట్టే నేడు అదే రీతిలో మజ్లిస్ పార్టీ వందేమాతరాన్ని వ్యతిరేకిస్తోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని 1980 నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు లాఠీదెబ్బలు తింటూ, కేసులు, జైళ్లను ఎదుర్కొని నిలకడగా పోరాడారని గుర్తుచేశారు. 2029 నాటికి తెలంగాణలోని ప్రతి గ్రామం, ప్రతి పంచాయతీ, ప్రతి ప్రభుత్వ పాఠశాల, ప్రతి చౌరస్తాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో విమోచన వేడుకలు నిర్వహించే రోజు ఎంతో దూరంలో లేదని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ జెండా ఎగరవేయడాన్ని అడ్డుకునే దమ్ము కాంగ్రెస్, బీఆరఎస్, మజ్లిస్‌లకు ఉందా అని సవాల్ విసిరిన ఆయన స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తే ప్రజలు తగిన శాస్తి చేస్తారని హెచ్చరించారు. అమరవీరుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తరఫున అధికారికంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్న ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, బండి సంజయ్ కుమార్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, మాజీ సైనిక అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు, తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు, పాత్రికేయ మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇది ప్రజా చైతన్యాన్ని రగిలించిన నేల

మొదటిపేజీ తరువాయి

సెప్టెంబర్ 17కు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా అప్పటి హైదరాబాద్ రాష్ట్రం నిజాం పాలనలోనే కొనసాగిందని చెప్పారు. తెలంగాణతోపాటు నేటి మహారాష్ట్ర కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు కూడా హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉండేవి.. నిజాం పాలనలో హైదరాబాద్ పారిశ్రామిక, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో పురోగతి సాధించింది.. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణచివేత తీవ్రంగా ఉండేది అని తెలిపారు. చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోలపరిచాయని, దేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడిందని చెప్పారు. ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు జరిగాయని, మరోవైపు రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా, భూమిభుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటం ఉద్ధృతమైందని, రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు ఈ పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. హైదరాబాద్ ప్రజల ఆకాంక్షలు, ఉద్యమాలు, పోరాటాల నేపథ్యంలో ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో ఆపరేషన్ పోలో సైనిక చర్య చేపట్టగా ఏడో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారని గుర్తు చేశారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైందని, అది నిజాం పాలకుల అధికారం ముగిసిన రోజు మాత్రమే కాదు.. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం అని అన్నారు. అందుకే సెప్టెంబర్ 17ను మనం ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఆ చరిత్ర మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది. పాలనలో ప్రజలే కేంద్రంగా ఉండాలి.. ప్రజల ఆశలు, ఆకాంక్షలే ప్రభుత్వ నిర్ణయాలకు ప్రామాణికం కావాలి. అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం అని ముఖ్యమంత్రి రేవంత్ చెప్పారు. తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో మాత్రమే కాదు.. ప్రపంచంతో పోటీ పడుతోందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం అని, అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాక ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. పాలమూరురంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎసఎల్‌బీసీతోపాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతునామన్నారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి.. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి.. అందుకే కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**బీసీలకు 42 శాతం**

**రిజర్వేషన్లకు బిల్లు రూపొందించాం**

సామాజిక అంతరాలను తగ్గించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయంగా చేపట్టామని, ఆ సర్వే ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించామని చెప్పారు. ఫిబ్రవరి 4ను ఏటా 'తెలంగాణ సోషల్ జస్టిస్ డే'గా జరుపుకుంటున్నామని, సామాజిక న్యాయం అంటే నినాదం కాదు.. వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం.. అవకాశాలు తక్కువగా దక్కిన వారికి మరిన్ని అవకాశాలు కల్పించడం.. అప్పుడే సమాజం సమానంగా ముందుకు సాగుతుందని అన్నారు. ప్రజా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్లలాంటివన్నారు. కుల, మత భేదాలు లేకుండా నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాం.. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం అని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించేందుకు రూ.927 కోట్లు ఖర్చు చేస్తున్నాం.. మధ్యాహ్న భోజనాన్ని 12వ తరగతి విద్యార్థుల వరకు విస్తరించాం.. 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం అని వివరించారు. విద్యా రంగంలో తీసుకున్న చర్యలతో పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుంది.. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశాం.. గ్రూప్1 నుంచి గ్రూప్4 వరకు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించా అని సీఎం చెప్పారు. ఏఐతో ఉద్యోగాల స్వరూపం మారుతోంది.. అందుకే నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసుకున్నామని చెప్పారు. పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నామన్నారు. మన యువత ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలి అని పిలుపునిచ్చారు.

**మౌలిక వసతులను వేగంగా విస్తరిస్తున్నాం**

రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కూడా వేగంగా విస్తరిస్తున్నామన్నారు. రూ.38,595 కోట్లతో 122.9 కి.మీ మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం.. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించాం.. హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ప్రారంభించాం.. 55 కి.మీ పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తాం అని చెప్పారు.

**రేపటి తెలంగాణను నిర్మించేందుకు ప్రణాళికలు**

మన లక్ష్యం రేపటి తెలంగాణను నిర్మించడం.. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నాం.. దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్ జీరో స్మార్ట్ సిటీ నిర్మిస్తున్నాం.. డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తాం అని ముఖ్యమంత్రి చెప్పారు.. ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకొచ్చింది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, ఈవీ పార్క్, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ వంటి ప్రత్యేక జోన్లతో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం.. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్‌నాగపూర్, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయి అని చెప్పారు. రహదారులు అభివృద్ధికి సూచిక అంటూ గ్రామం నుంచి మండలానికి, మండలం నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.. విద్యుత్ డిమాండ్ కూడా పెరిగింది.. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నాం.. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలవైపు నుంచి కూడా సహకారం ఆశిస్తున్నాం.. వీబీజీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం అని సీఎం చెప్పారు.

**చరిత్రను మరిచిపోం**

అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం ప్రజా పాలనకు పునాదులు. సెప్టెంబర్ 17 మనకు గతాన్ని మాత్రమే గుర్తు చేసే రోజు కాదు. మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. చరిత్రను మరిచిపోం.. చరిత్ర దగ్గరే ఆగిపోం.. ఆ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం అని పునరుద్ఘాటించారు.



# ఓటర్ల నోటీసుల పరిష్కారం మరింత సులభతరం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 :

'సర్' ప్రక్రియలో భాగంగా ఓటర్లకు అందించిన నోటీసుల పరిష్కార ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం మరింత సులభతరం చేసింది. ఇప్పటి వరకు ఓటర్ల కు అందించిన నోటీసులను పరిష్కరించేందుకు సంబంధిత ఓటరు కుటుంబ సభ్యులలో ఎవరైనా ఒకరు ఇఆర్ఒ/ఎఇఆర్ఒల ఎదుట వ్యక్తిగతంగా హాజరై తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన అవసరమైన పత్రాలు, అవసరమై సమాచారాన్నిఅందించేందుకు అవకాశం కల్పించినట్లు సీఈవో సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరుకు సంబంధించిన పత్రాలను స్వీకరించి జారీ చేసిన నోటీసుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారులకు దీనికి సంబంధించిన సమాచారాన్ని అందించామని, దానికి అనుగుణంగా ఓటర్లకు ఇచ్చిన నోటీసులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా ఫారం6కు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, డిక్లరేషన్ ఫారం స్వీకరణ, క్లెయిమ్ ల పరిష్కార ప్రక్రియలో భాగంగా అర్హత తేదీ 1.10.2026 పరిగణిస్తూ ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న ఫారం6 దరఖాస్తులకు, అలాగే భవిష్యత్తులో అందే ఫారం6 దరఖాస్తులకు సంబంధించి నిర్దేశిత డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా స్వీకరించాలని కూడా ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.



# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అందించనున్నట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణను 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తమ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని యూకే బిజినెస్ స్కూల్స్ బృందం భేటీలో అన్నారు. ఎంసీఆర్ హెచఆర్డీలో గురువారం జరిగిన భేటీలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈవో ఫ్లోరా హామిల్టన్, డీన్లు, ఉన్నతస్థాయి అధికారులు, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులు సహా 30మంది వివిధ యూకే యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయాల అవసరాలకు తగ్గట్టు ఏర్పాట్లు చేసేందుకు అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎంఐటీ, పర్డ్యూ వంటి పలు ఐవీ లీగ్ యూనివర్సిటీల ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు ప్రక్రియ మొదలైందన్నారు. విదేశీ విద్యాసంస్థల రాకతో స్థానిక విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి, ఇక్కడే పరిశోధనలు చేపట్టడానికి దోహదపడుతుందన్నారు. యూకే బిజినెస్ స్కూల్స్ తెలంగాణలో ఏర్పాటైతే ప్రపంచస్థాయి కార్పొరేట్ వ్యాపార సంస్థలు రాష్ట్రం వైపు చూస్తాయని అన్నారు. అదే సమయంలో రాష్ట్ర విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ సంస్థలు, అంతర్జాతీయ అనుభవం, ప్రపంచస్థాయి అవకాశాలు అందుబాటులో ఉంటాయని సీఎం అన్నారు. ఈ దిశగా హార్వర్డ్, ఎంఐటి, లండన్ విశ్వవిద్యాలయం, వర్జీనియా టెక్, నార్త్ఈస్టర్న్ విశ్వవిద్యాలయం వంటి అనేక ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లు, డ్యూయల్ డిగ్రీ కోర్సులు, అధ్యాపకుల శిక్షణ, పరిశోధన వంటి రంగాల్లో భాగస్వామ్యాలు ప్రారంభించవచ్చన్నారు. అలాగే విద్యార్థులకు ఇంగ్లీష్, జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ అందించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీని దాదాపు 30వేల ఎకరాల విస్తీర్ణంలో దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అక్కడ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుతో భావితరాలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. డిసెంబర్‌లో అక్కడ నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు రావాల్సిందిగా ఈ బృందానికి ఆహ్వానం పలికారు. యూకే విద్యా వ్యవస్థలో ముఖ్యులందరికీ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించనున్నట్టు తెలిపారు. ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ అగ్రగామి సంస్థలు ముందుకొస్తున్నాయి. టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించనుందని, లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రపంచంలోనే మేటి విశ్వవిద్యాలయాలు, ఫార్చ్యూన్500 కంపెనీలు తెలంగాణాలో ఉండే విధంగా అడుగులు వేస్తున్నామన్నారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, అలాగే ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటి ద్వారా విద్యా వ్యవస్థను సమూలంగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని సీఎం వివరించారు.





# పేదల ఇళ్ల స్థలాలపై ప్రత్యేక దృష్టి

మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన కార్యక్రమంలో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలనే ఉద్దేశంతో కొన్ని గ్రామాల్లో భూములను సేకరించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ భూములు అన్యాక్రాంతమై కొందరి అధీనంలోకి వెళ్లాయని మంత్రి ఆరోపించారు. ఆ భూములను గుర్తించి అన్యాక్రాంతం నుంచి విడిపించి అర్హులైన పేదలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. ఈ మేరకు ఆయా భూములను గుర్తించి వివరాలను పరిశీలించి, అర్హులైన పేదలకు కేటాయించేలా ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. పేదలకు ఇళ్ల స్థలం ఇవ్వడం కేవలం ప్రభుత్వ పథకం కాదు.. ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవంతో జీవించే హక్కును కల్పించే బాధ్యత అని అన్నారు.



# 'పీఎం విశ్వకర్మ యోజన'తో ఆర్థిక భరోసా

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**
- **పార్టీ కార్యాలయంలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 17, చురకలు :

గత ప్రభుత్వాలు విస్మరించిన చేతివృత్తుల వర్గాలకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన ద్వారా ఆర్థిక భరోసాతోపాటు సముచిత గుర్తింపు కల్పించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తెలిపారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు ఎంతో చారిత్రక, విశిష్టమైన దినమని పేర్కొన్నారు. తెలంగాణ విమోచన దినంతోపాటు దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం, దేవశిల్పి భగవాన్ విశ్వకర్మ జయంతి ఒకే రోజు రావడం ఎంతో శుభపరిణామమన్నారు. దేశ నిర్మాణంలో కమ్మరి, వడ్రంగి, కంసాలి, స్వర్ణకారులు, శిల్పులు వంటి అనేక చేతివృత్తుల వర్గాల శ్రమ ఎనలేనిదని అన్నారు. అయితే గత పాలకులెవరూ ఈ చేతివృత్తుల కులాల సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే వారి శ్రమను గుర్తించి వారికి ఉపాధితోపాటు నేరుగా ఆర్థిక సహాయం అందించాలనే సంకల్పంతో 'పీఎం విశ్వకర్మ యోజన'ను ప్రవేశపెట్టారని వివరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా లక్షలాదిమంది లబ్దిదారులకు సులభతర రుణాలు, పనిముట్లు, శిక్షణ అంది వారి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, వ్యాపారాలను విస్తరించుకోగలుగుతున్నారని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్రగామిగా దూసుకుపోతున్న వేళ వోకల్ ఫర్ లోకల్ - లోకల్ టు గ్లోబల్ అనే నినాదంతో స్వదేశీ చేతివృత్తుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో గిరాకీ తెచ్చేందుకు కేంద్రం నిరంతరం కృషి చేస్తోందన్నారు. వికసిత భారత్ నిర్మాణంలో చేతివృత్తుల వారు కేవలం ఉపాధి పొందడమే కాక ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నదే మోదీ లక్ష్యమని చెప్పారు. తెలంగాణ ప్రజలకు, చేతివృత్తుల సోదరసోదరీమణులందరికీ భగవాన్ విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి, సీనియర్ నాయకుడు వకుళాభరణం కృష్ణమోహన్ రావు, తదితరులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓపెన్ డీల్

- **ఆశీర్వాద దీపం కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి ధ్వజం**

హైదరాబాద్, సెప్టెంబర్ 17, చురకలు:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల భూదోపిడీని ప్రస్తావించడం కేవలం కాంగ్రెస్ అధిష్ఠానానికి నిధులు పంపే 'ఓపెన్ డీల్' కోసమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. పక్కా ఆధారాలు ఉన్నాయని చెబుతున్న ప్రభుత్వం విచారణ కమిషన్ల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే దోషులను అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంజయ్ కార్యకర్తలతో కలిసి దీపం వెలిగించి మాట్లాడారు. బీఆర్ఎస్ నేతల భూదోపిడీపై సీఎం వద్ద అన్ని ఆధారాలు ఉన్నప్పుడు మళ్లీ సిట్, విచారణ కమిషన్లు అని జాప్యం చేయడం ఎందుకు.. రాబోయే ఎన్నికల కోసం ఏఐసీసీకి కప్పం కట్టడానికే బీఆర్ఎస్‌కు సీఎం ఓపెన్ ఆఫర్ ఇచ్చి డీల్ స్టార్ట్ చేశారు... నిజంగా ఆధారాలు ఉంటే తక్షణమే భూదోపిడీదారులను అరెస్ట్ చేసే అధికారముంది కదా అని ప్రశ్నించారు.

**కేసీఆర్, కేటీఆర్‌ల నేపథ్యంపై తీవ్ర విమర్శలు**

కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని అన్న కేటీఆర్ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు కేసీఆర్ పుట్టుకతోనే భూస్వామి అయితే 2004 ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఎకరం భూమి కూడా లేదని ఎలక్షన్ కమిషన్‌కు ఎందుకు సమర్పించారో చెప్పాలి. యువజన కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు దొంగ పాస్‌పోర్టుల దందా కేసుల్లో సస్పెన్షన్‌ను తప్పించుకోవడానికే కేసీఆర్ రాత్రికి రాత్రే టీడీపీలో చేరారు. కేటీఆర్ అసలు పేరు 'అజయ్ రావు' అని, ఆనాడు ఎన్టీఆర్ నుంచి ఎమ్మెల్యే టికెట్ పొందడం కోసమే ఆయన పేరును 'తారక రామారావు'గా మార్చుకున్నారని ఎద్దేవా చేశారు.

**నిజాంను పొగడటం దుర్మార్గం**

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిజాంను పొగడటాన్ని బండి సంజయ్ తప్పుబట్టారు. "నిజాం పాలకులు గొప్పవారైతే నాటి ప్రధాని నెహ్రూ, సర్దార్ పటేల్ సైన్యాన్ని పంపి నిజాం మెడలు ఎందుకు వంచారు? వీరబైరాన్‌పల్లి, పరకాల, గుండ్రాంపల్లి ప్రాంతాల్లో రజాకార్లు జరిపిన దారుణాలకు, వందలాది మంది నిర్బంధ హత్యలకు సీఎం ఏం సమాధానం చెప్తారు?" అని నిలదీశారు.

**బీజేపీకి అవకాశం ఇవ్వాలి**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పర ఆరోపణల డ్రామాలతో 6 గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధించాలంటే 'డబుల్ ఇంజిన్ సర్కార్'తోనే సాధ్యమని, ఈసారి ప్రజలంతా బీజేపీకి అధికారం ఇచ్చి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, సీనియర్ నేతలు చింతల రామచంద్రారెడ్డి, డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, శ్రీవర్దన్ రెడ్డి, బద్దం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ కొనసాగింపు

- మరో ఐదేళ్లపాటు పదవిలో కొనసాగనున్న ఎన్. చంద్రశేఖరన్
- వరుసగా మూడోసారి ఛైర్మన్‌గా బాధ్యతలు
- టాటా గ్రూప్ వ్యూహాలు, విస్తరణకు కొనసాగనున్న నాయకత్వం
- పెట్టుబడులు, సాంకేతికత, అంతర్జాతీయ వ్యాపారాలపై దృష్టి
- • టాటా గ్రూప్ అత్యున్నత నాయకత్వంలో కొనసాగనున్న స్థిరత్వం



**ముంబయి, సెప్టెంబరు 17, చురకలు:**

టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ మరోసారి ఎంపికయ్యారు. దీంతో ఆయన మరో ఐదేళ్లపాటు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా ఛైర్మన్‌గా పనిచేసిన ఆయనకు వరుసగా మూడోసారి అవకాశం దక్కింది.

**గ్రూప్ విస్తరణపై దృష్టి**

టాటా గ్రూప్‌లో సుదీర్ఘకాలంగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న చంద్రశేఖరన్.. ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వ్యాపారాలు, పెట్టుబడులు, విస్తరణకు సంబంధించిన పలు నిర్ణయాలకు నాయకత్వం వహించారు. తాజా పదవీకాలంలోనూ ఈ వ్యూహాలకు కొనసాగింపు ఇవ్వడంతోపాటు కొత్త అవకాశాలపై దృష్టి సారించే అవకాశం ఉంది.

**నాయకత్వంలో కొనసాగింపు**

టాటా సన్స్ టాటా గ్రూప్‌కు ప్రధాన హోల్డింగ్ సంస్థగా వ్యవహరిస్తుంది. గ్రూప్‌లోని వివిధ వ్యాపార సంస్థలకు వ్యూహాత్మక దిశానిర్దేశం చేయడంలో ఛైర్మన్ పాత్ర కీలకం. చంద్రశేఖరన్ మరో ఐదేళ్లు కొనసాగనుండటంతో గ్రూప్ నాయకత్వంలో స్థిరత్వం కొనసాగనుంది.

# థర్డ్ ఫ్రంట్ దిశగా చర్చలు

- ప్రాంతీయ పార్టీల అధినేతలతో కనిమొళి వరుస భేటీలు
- ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్, సుప్రియా సూలేలతో సమావేశాలు
- త్వరలో మమతా బెనర్జీతో భేటీ అయ్యే అవకాశం
- డీలిమిటేషన్ అంశంపై ప్రాంతీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం
- గతంలోనూ కార్యరూపం దాల్చని కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి ప్రయోగాలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17, చురకలు:**

జాతీయ రాజకీయాల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలతో కూడిన మూడో కూటమి ఏర్పాటుపై చర్చలు మళ్లీ తెరపైకి వచ్చాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు రెండేళ్ల సమయం ఉండగానే డీఎంకే ఎంపీ కనిమొళి ప్రాంతీయ పార్టీల అధినేతలతో వరుసగా సమావేశమవుతుండటం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ముంబైలో శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, సుప్రియా సూలేలతో భేటీ అయిన ఆమె.. త్వరలో కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీని కలిసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో..**

తమిళనాడులో కాంగ్రెస్‌డీఎంకే మధ్య దశాబ్దాలుగా కొనసాగిన పొత్తులో ఇటీవల విభేదాలు తలెత్తాయి. నటుడు విజయ్ స్థాపించిన టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంపై డీఎంకే అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జూన్‌లో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి డీఎంకే దూరంగా ఉంది. పార్లమెంట్‌లో తమ ఎంపీలకు ప్రత్యేక సీటింగ్ కేటాయించాలని కనిమొళి స్పీకర్‌ను కోరడం, విపక్షాలు బహిష్కరించిన స్పీకర్ టీ పార్టీకి హాజరు కావడం వంటి పరిణామాలు కూడా రెండు పార్టీల మధ్య దూరాన్ని సూచించాయి.

అయితే ప్రాంతీయ పార్టీలతో కనిమొళి భేటీలకు డీలిమిటేషన్ అంశం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఉద్ధవ్ ఠాక్రేతో జరిగిన సమావేశంలో నియోజకవర్గాల పునర్విభజన, ఇండియా కూటమి భవిష్యత్తుపై చర్చించినట్లు శివసేన (యూబీటీ) వర్గాలు తెలిపాయి. జనాభా ప్రాతిపదికన స్థానాల విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందని డీఎంకే ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ అంశంపై ప్రాంతీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావాలనే వ్యూహంలో భాగంగానే సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**గతంలోనూ ఫలించని ప్రయత్నాలు**

కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలతో కూటమి ఏర్పాటుకు గతంలోనూ పలు ప్రయత్నాలు జరిగాయి. 2013లో మమతా బెనర్జీ ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్‌తో సమావేశమై ఈ ఆలోచనను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే అది ఎన్నికలకు ముందే నిలిచిపోయింది. 2024 ఎన్నికలకు ముందు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో 'ప్రోగ్రెసివ్ గ్రూప్ ఆఫ్ స్టేట్స్' ఏర్పాటు ఆలోచనను ప్రతిపాదించారు. ఆ ప్రయత్నం కూడా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కనిమొళి భేటీలతో మూడో కూటమి అంశం మళ్లీ చర్చనీయాంశమైనప్పటికీ, అది వాస్తవ రూపం దాల్చుతుందా లేదా అన్నది భవిష్యత్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

# మావోయిస్టు కీలక నేత అసీమ్ మండల్ లొంగుబాటు

- పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోలీసుల ఎదుట ఆయుధాల విరమణ
- కోల్‌కతా టాస్క్‌ఫోర్స్ ఎదుట లొంగిపోయిన ఆకాశ్
- 1980ల నుంచి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన నేత
- పట్టివేతకు జార్ఖండ్, ఒడిశా ప్రభుత్వాల భారీ రివార్డులు
- ఈస్టర్న్ స్టేట్స్ నెట్‌వర్క్‌కు గట్టి దెబ్బగా పరిణామం

**కోల్‌కతా, సెప్టెంబరు 17, చురకలు:**

మావోయిస్టు పార్టీకి చెందిన కీలక నేత, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి అసీమ్ మండల్ అలియాస్ ఆకాశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. కోల్‌కతా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఆయుధాలు అప్పగించినట్లు అధికారులు అధికారికంగా ధ్రువీకరించారు. 1980ల నుంచి మావోయిస్టు ఉద్యమంలో చురుకుగా ఉన్న ఆయన లొంగుబాటు పార్టీకి, ముఖ్యంగా ఈస్టర్న్ స్టేట్స్ నెట్‌వర్క్‌కు గణనీయమైన నష్టంగా భావిస్తున్నారు.

**రూ.2.20 కోట్ల రివార్డు**

అసీమ్ మండల్ ఆచూకీ తెలిపిన వారికి జార్ఖండ్ ప్రభుత్వం రూ.కోటి, ఒడిశా ప్రభుత్వం రూ.1.20 కోట్ల రివార్డును ప్రకటించాయి. జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో భద్రతా దళాలపై దాడులు, పేలుళ్లు, హింసాత్మక ఘటనలకు సంబంధించి ఆయనపై 55కు పైగా కేసులు నమోదయ్యాయి.

**పార్టీ కార్యకలాపాలపై ఆరా**

2011లో మావోయిస్టు అగ్రనేత కిషన్‌జీ మరణించిన తర్వాత పశ్చిమ బెంగాల్‌లో పార్టీ కార్యకలాపాలను అసీమ్ మండల్ పర్యవేక్షించినట్లు తెలుస్తోంది. భద్రతా బలగాల ఒత్తిడి, అనారోగ్య కారణాలతో ఆయన అజ్ఞాతం వీడినట్లు సమాచారం. ప్రస్తుతం రహస్య స్థావరాలు, ఆయుధ నిల్వలు, ఇతర కీలక నేతల వివరాలపై పోలీసులు ఆయనను విచారిస్తున్నారు.

# పోస్టాఫీసులో రూ.39.25 లక్షల గోల్‌మాల్

- తవాంగ్ పోస్టాఫీసు పరిధిలో నిధుల దుర్వినియోగం
- మల్టీ టాస్కింగ్ స్టాఫ్ మహిళా ఉద్యోగిని అరెస్టు
- ఆకస్మిక ఆడిట్‌లో బయటపడిన అకౌంటింగ్ అవకతవకలు
- పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ ప్రీమియంలలో రూ.34.49 లక్షల తేడా
- కౌంటర్ నగదులో మరో రూ.4.75 లక్షలు గల్లంతు



**తవాంగ్, సెప్టెంబరు 17, చురకలు:**

అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ పోస్టాఫీసులో సుమారు రూ.39.25 లక్షల నిధులు గోల్‌మాల్ అయిన ఘటన వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో పోస్టాఫీసు మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) మహిళా ఉద్యోగినిని పోలీసులు అరెస్టు చేశారు. బొందిలా పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టాఫీసెస్ నీలమై సింగ్ సెప్టెంబరు 7న నిర్వహించిన ఆకస్మిక ఆడిట్‌లో అకౌంటింగ్ అవకతవకలు బయటపడ్డాయి.

**రూ.34.49 లక్షల ప్రీమియంలు జమ కాలేదని ఆరోపణ**

2023 జనవరి 1 నుంచి 2024 మే 31 మధ్య పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్‌పీఎల్ఐ) ప్రీమియంల రూపంలో వసూలైన రూ.34.49 లక్షలు అధికారిక ఖాతాల్లో జమ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదనంగా రూ.4.75 లక్షల కౌంటర్ నగదు కూడా లెక్కల్లోకి రాలేదని గుర్తించారు. సెప్టెంబరు 10 నాటికి మొత్తం రూ.39.25 లక్షల తేడా ఉన్నట్లు నిర్ధారించారు.

**ఎఫ్ఐఆర్ నమోదు.. పోలీస్ కస్టడీకి తరలింపు**

నిధుల వ్యవహారంపై పోస్టల్ అధికారులు ప్రశ్నించగా, ప్రజా నిధులను దుర్వినియోగం చేసినట్లు ఉద్యోగిని అంగీకరించిందని ఫిర్యాదులో తెలిపారు. దీనిపై నీలమై సింగ్ సెప్టెంబరు 13న తవాంగ్ పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వక ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు నిందితురాలిని అరెస్టు చేసి కస్టడీకి తరలించారు. స్టేషన్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ అంగు ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# మోదీ వాణి గ్రంథం ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, చురకలు :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినోత్సవం సందర్భంగా వెలువరించిన 'మోదీ వాణి సేవ.. సంకల్పం.. వికసిత భారత' త్రిభాషా గ్రంథాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు సంయుక్తంగా ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, రాజకీయ, సామాజిక విశ్లేషకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు ఈ గ్రంథాన్ని రూపొందించారు. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ పన్నెండేళ్ల పాలనా కాలంలో దేశంలో, విదేశాల్లో చేసిన పసంగాలను విస్తృతంగా పరిశీలించి ప్రజల్లో విశేష గుర్తింపు పొందిన ముఖ్యమైన వ్యాఖ్యలు, వాక్యాలు, కొటేషన్లను ఈ గ్రంథంలో పొందుపరిచారు. మోదీ ఆలోచనలు, పాలనా దృక్పథం, జాతీయ దర్శనాన్ని సమగ్రంగా పరిచయం చేశారు.

**గ్రంథం ప్రత్యేకతలు**

ప్రతి కొటేషన్‌ను ముందుగా మోదీ వ్యాఖ్యానించిన హిందీ భాషలో ఇచ్చి ఆ తరువాత సహజమైన తెలుగు, ఇంగ్లీష్ రూపాలను పొందుపరిచారు. ప్రధానమంత్రి అధికారిక ప్రసంగాలు, విశ్వసనీయమైన ప్రామాణిక ఆధారాలను విస్తృతంగా పరిశీలించి కొటేషన్లను ఎంపిక చేశారు. ప్రతి వ్యాఖ్యకు సంబంధించిన సందర్భం, ప్రసంగ నేపథ్యం, మూల వివరాలను స్పష్టంగా అందించారు. సేవ, సంకల్పం, సుపరిపాలన, అంత్యోదయం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, యువశక్తి, రైతు సంక్షేమం, ఆత్మనిర్భర్ భారత్, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ వేదికపై భారతదేశ నాయకత్వం వంటి విస్తృత అంశాలకు ఇందులో స్థానం కల్పించారు. మోదీ సందేశాలు, పాలనా తత్వం, దేశ భవిష్యత్తుపై ఆయన దార్శనికతను మూడు భాషల పాఠకులకు చేరువ చేసే వినూత్న ఆలోచనే ఈ గ్రంథం. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతకుమార్, జయశ్రీ, కల్యాణ్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు, డాక్టర్ వేముల అశోక్, టి. వీరేందర్ గౌడ్, బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్, సీనియర్ నాయకులు శ్రీనిరెడ్డి, గోపాల్ జీ, సుభాష్ చంద్ర జీ, రాణి రుద్రమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



# పోరాటాలతోనే హైదరాబాద్‌కు విముక్తి

- మీడియా అకాడమి ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, చురకలు :**

హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం అయ్యేందుకు ప్రజా సంఘాలు ఉద్యమాలు, సభలు, సమావేశాలు నిర్వహించి నిజాం నిరంకుశ పాలనపై తిరగబడ్డాయని మీడియా అకాడమి ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అప్పటి హైదరాబాద్ విలీన చరిత్రలో రజాకార్ల భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ సాయుధ పోరాటాల గురించి వివరించారు. భారత దేశానికి 1947 ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ ప్రాంతానికి మాత్రం 13 నెలలకు సెప్టెంబర్ 17వ తేదీన వచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రస్థానంలో అనేకమంది పాల్గొని త్యాగాలు చేశారని, ప్రాణాలు కోల్పోయారని, వారి పోరాటాల ఫలితమే నేడు మనం జరుపుకుంటున్న ఈ పతాకావిష్కరణ కార్యక్రమం అని చెప్పారు. ఇది నైజాం నిరంకుశ పాలన నుండి మనకు విముక్తి కలిగిన దినంగా గుర్తుంచుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. రాబోయే కాలంలో హైదరాబాద్ అభివృద్ధిలో ఫ్యూచర్ సిటీ పేరుతో అనేక పరిశ్రమల స్థాపన, అర్బన్ డెవలప్‌మెంట్, క్రీడా రంగం, ఫార్మా రంగం, ఐటీ వంటి అనేక సంస్థలు భాగస్వామ్యం అవుతున్నాయని శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు షెడ్యూల్

- రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 2027లో ముగియనున్న పదవీకాలం
- మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గాలకు కొత్త జాబితా
- సెప్టెంబరు 28న నోటిఫికేషన్.. నవంబరు 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నవంబరు 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

**హైదరాబాద్, సెప్టెంబరు 17, చురకలు:**

తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల స్థానాలు మార్చి 2027లో ఖాళీ కానున్న నేపథ్యంలో కొత్త ఓటర్ల జాబితా తయారీకి ఎన్నికల సంఘం ప్రక్రియ ప్రారంభించింది. మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్, వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాలకు ఓటర్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వెల్లడించారు.

**ఓటర్ల నమోదుకు కీలక తేదీలు**

2026 నవంబరు 1 నాటికి విద్యార్హత సాధించిన పట్టభద్రులు ఈ ఓటర్ల నమోదుకు అర్హులు. సెప్టెంబరు 28న నోటిఫికేషన్ విడుదల కానుంది. అర్హులు నవంబరు 6లోగా ఫారం18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. నవంబరు 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. దీనిపై అభ్యంతరాలు, సవరణలను నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు స్వీకరిస్తారు. పరిశీలన, పరిష్కార ప్రక్రియ అనంతరం డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.

**పాత ఓటర్లు కూడా కొత్తగా నమోదు కావాలి**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఎన్నికకు కొత్త ఓటర్ల జాబితా రూపొందిస్తారు. దీంతో గత ఎన్నికల్లో ఓటరుగా నమోదైన వారు కూడా ఈసారి మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సీఈఓ సూచించారు.




**ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు**

ఫారం18ను ఆన్‌లైన్‌లో సీఈఓ తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ ద్వారా సమర్పించవచ్చు. ఆఫ్‌లైన్‌లో ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లేదా నియమిత అధికారుల వద్ద దరఖాస్తు అందజేయవచ్చు. స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కూడా ఫారం 18ను పంపే అవకాశం ఉంది. దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారి లేదా నోటరీ ధ్రువీకరించిన డిగ్రీ సర్టిఫికెట్ లేదా ప్రొవిజనల్ మార్కుల మెమో ప్రతిని జతచేయాలి.

# రాజక్కపేటలో ఘనంగా విశ్వకర్మ జయంతి



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో గురువారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు, జెండా ఆవిష్కరణ, పూలమాలలు, నైవేద్య సమర్పణ చేశారు. సంఘ సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి సర్పంచ్ పాతకోటి పద్మ వెంకటేష్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పిన్నోజీ ప్రభాకర్ తో పాటు సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సృష్టి, నిర్మాణ, శిల్పకళకు ప్రతీక విశ్వకర్మ భగవానుడని, సమాజ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర కీలకమని, ఐక్యతతో ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించిన అధికారులు



**మిరుదొడ్డి, సెప్టెంబర్ 17, :**
సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల వ్యాప్తంగా గురువారం ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వినోద్ కుమార్, మండల వనరుల కేంద్రం వద్ద ఎంఈఓ ప్రవీణ్ బాబు, వ్యవసాయ కార్యాలయం ఎదుట ఏఈఓ ప్రశాంత్, ఐకేపీ కార్యాలయం వద్ద ఏపీఎం నర్సమ్మ త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజాపాలన దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు తమ శాఖల పరంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణకార సంఘం 18వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్





**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
జగిత్యాల పట్టణంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వర్ణకార సంఘం 18వ వార్షికోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి విశ్వకర్మ బ్రహ్మోత్సవాలను ప్రారంభించి, జగిత్యాల పట్టణ స్వర్ణ కార సంఘంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా హాజరై ఇండియన్ రెడ్ క్రాస్ అధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని ప్రారంబించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. 75వ సారి రక్తదానం చేసిన కనపర్తి రవిని శాలువాతో సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షులు గజంగి నందయ్య, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, బండ శంకర్, టివి సత్యం, టివి సూర్యం, మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు పంబాల సుజాత రాము, సాయి కిరణ్, కత్రోజ్ గిరి, రంగు రాజయ్యా, దుమాల రాజ్ కుమార్, సంఘం కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# రైతులు పొలాల్లోకి.. దొంగలు ఇండ్లలోకి..

- ఆరెపల్లిలో మిట్టమధ్యాహ్నం తాళాలు పగలగొట్టి చోరీ
- రెండు ఇండ్లలో 4.5 తులాల బంగారం, 47 తులాల వెండి అపహరణ
- మధ్యాహ్నం భోజనానికి వచ్చిన బాధితులకు షాక్
- కన్నీరుమున్నీరవుతున్న రెండు కుటుంబాలు





**మిరుదొడ్డి, సెప్టెంబరు 17, :**
కష్టాన్ని నమ్ముకుని ఆ దంపతులు పొలం పనులకు వెళ్లారు. కష్టపడి సంపాదించుకున్న బంగారం, వెండి రూపంలో దాచుకున్న సొమ్ముకు ఇంట్లోనే రక్షణ ఉంటుందనుకున్నారు. కానీ, ఆ నమ్మకాన్ని వమ్ము చేసిన దొంగలు మిట్టమధ్యాహ్నమే వాటిని లూటీ చేశారు. రైతులు పొలాల్లో శ్రమిస్తున్న సమయాన్ని ఆసరాగా చేసుకుని, తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ఆరెపల్లిలో గురువారం మధ్యాహ్నం సమయంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఒక్కసారిగా రెండు ఇండ్లలో తాళాలు పగలగొట్టి సుమారు నాలుగున్నర తులాల బంగారం, 47 తులాల వెండి ఆభరణాలను అపహరించుకు పోయారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన లకిడి ప్రకాష్, వజ్జపల్లి నర్సింగరావు ఉదయం ఎప్పటిలాగే తమ ఇండ్లకు తాళాలు వేసి వ్యవసాయ పొలాల వద్దకు పనుల కోసం వెళ్లారు. మధ్యాహ్న సమయంలో భోజనం చేయడానికి ఇండ్లకు తిరిగి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి వారు ఉలిక్కిపడ్డారు. ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువాలు తెరిచి, దుస్తులు, సామాన్లు అస్తవ్యస్తంగా పడి ఉండటాన్ని గమనించారు. అప్పటికే జరగరాని నష్టం జరిగిందని గుర్తించారు. దుండగులు లకిడి ప్రకాష్ ఇంట్లో నుంచి మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, సుమారు 25 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అలాగే వజ్జపల్లి నర్సింగరావు ఇంట్లో నుంచి తులం బంగారం, 22 తులాల వెండి ఆభరణాలను లూటీ చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాల్లో, దాచుకున్న బంగారు నగలు దొంగల పాలవడంతో బాధితులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు మిరుదొడ్డి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ సహాయంతో వేలిముద్రలను సేకరిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో గ్రామంలో దొంగలు పడటంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

# రైతుల అభివృద్ధికి ఎఫ్‌పీఓలు కీలకం

- సిద్దిపేటలో రైతులకు అవగాహన సదస్సు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
రైతుల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమానికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు) ఎంతో ఉపయోగ పడతాయని ఎఫ్‌పీఓ అధికారి మల్యాల శివాని తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం రైతులకు ఎఫ్‌పీఓలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓల ప్రాధాన్యత, రైతులకు కలిగే ప్రయోజనాలు, వ్యాపార అవకాశాలపై రైతులకు వివరించారు. రైతులు సంఘటితంగా ముందుకు వస్తే వ్యవసాయ రంగంలో మరిన్ని లాభాలు పొందవచ్చని శివాని తెలిపారు. ఎఫ్‌పీఓలో సభ్యత్వం కోసం రూ.2,000 చెల్లించిన రైతులకు ప్రభుత్వం మరో రూ.2,000 జోడించి, సంబంధిత ధ్రువపత్రాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తమకు ఆసక్తి ఉన్న వ్యాపారాలు, అనుబంధ ఉపాధి రంగాల వివరాలను ఎఫ్‌పీఓలకు తెలియజేయాలని కోరారు. రైతుల అవసరాలకు అనుగుణంగా వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఎఫ్‌పీఓల ద్వారా వచ్చే లాభాలు ఆయా రైతు సంఘాలకే చెందుతాయని వివరించారు. విలువ ఆధారిత ఉత్పత్తులు, నిల్వ, మార్కెటింగ్ వంటి రంగాల్లో రైతులు భాగస్వాములు కావడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని శివాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సిబ్బంది వెంకటరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలించిన కలెక్టర్



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
దుబ్బాక మండలం రామక్కపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం, పప్పు, క్యాబేజీ కూర, రసం, గుడ్డు, నెయ్యి నాణ్యత, రుచి, పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు. భోజన తయారీకి ఉపయోగిస్తున్న సరుకుల నాణ్యతను తనిఖీ చేసి, విద్యార్థినులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించడంతో పాటు కూరగాయల పరిమాణాన్ని కొలిచి తనిఖీ చేశారు. వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, భోజనం తయారీలో పరిశుభ్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిర్దేశిత ఆహార పట్టిక ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్ విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తెలిపిన సమస్యలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణంతో పాటు నాణ్యమైన వసతి, భోజనం, మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# విశ్వకర్మ నైపుణ్యాలను ప్రోత్సహించాలి





**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, సీపీ సాధనా రష్మీ పెరుమాళ్, అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ కళాత్మకంగా రూపొందించే ప్రతి వస్తువులో విశ్వకర్మ నైపుణ్యం కనిపిస్తుందని అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. అనాదరణకు గురైన పిల్లలకు విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలను అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ కట్టా హైమావతి మాట్లాడుతూ విశ్వకర్మను సృష్టికర్తగా భావిస్తారని తెలిపారు. కమ్మరి, కంసాలి, వడ్రంగి, శిల్పి, కాంస్యకారులు వంటి వృత్తులు విశ్వకర్మ సంప్రదాయంతో ముడిపడి ఉన్నాయని అన్నారు. అనేక రకాల నిర్మాణాలు, వస్తువుల తయారీలో నైపుణ్యం కలిగిన వృత్తిదారుల సృజనాత్మకత అభినందనీయమని పేర్కొన్నారు. విశ్వకర్మ దేవతలకు ఆయుధాలు తయారు చేసి అందించారని, ఆయనను పరబ్రహ్మ స్వరూపంగా భావించి పూజించాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, డీఆర్వో, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఐడీఓసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని కృపతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**గూడూరు సమత మహేష్ గౌడ్**



**నాగారం, సెప్టెంబర్ 17, :**
శ్రీమహా గణనాధుని కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని గూడూరు సమత మహేష్ గౌడ్ అన్నారు. వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని నాగారం ఓల్డ్ విలేజ్ పరిధిలోని శ్రీ కోట మైసమ్మ ఆలయం సమీపంలో నెలకొల్పిన శ్రీ గణనాధుని గూడూరు సమత మహేష్ గౌడ్, ముద్రగణం ఉమ దేవేందర్ యాదవ్, ముద్రగణం పోచమ్మ మహేందర్ యాదవ్ లు గురువారం దర్శించుకున్నారు. అనంతరం వారు వినాయక స్వామి కరుణాకటాక్షంతో పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండప నిర్వహకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాను కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్, గూడూరు ప్రభాకర్ గౌడ్, గూడూరు చక్రపాణి గౌడ్, గూడూరు అవినాష్ గౌడ్, గూడూరు నితీష్ గౌడ్, గూడూరు కౌశిక్ గౌడ్, గూడూరు సత్యమ్మ, మల్లేశ్వరి, అరుణ, జ్యోతి, మాజీ కౌన్సిలర్ సబిత, లావణ్య, సమత, శ్వేత బిందు, కీర్తి, తదితరులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ను కల్పిత నాయకుడు అనడం సిగ్గుచేటు

- **రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి**
- **హమారా ప్రసాద్ పై దేశద్రోహ కేసు నమోదు చేయాలి**
- **దళిత ప్రజా సంఘాల నేతల ఆగ్రహం**

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 17, :**
హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరగనున్న "హమారా ప్రసాద్ – అంబేద్కర్ కల్పిత నాయకుడు" అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని అంబేద్కర్ వాదులు, దళిత సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రపంచంలోనే 32 డిగ్రీలు పొందిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను కల్పిత నాయకుడు అనడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ మాల మహానాడు నాయకులు పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ లేకుంటే మాట్లాడే స్వేచ్ఛ కూడా ఉండేది కాదని, నీ వెనుక ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాదులు నడిపిస్తున్నారని ఆరోపించారు. పుస్తకావిష్కరణ నిలిపివేయకపోతే నిన్ను అడ్డుకోవడానికి ఎక్కడికైనా సిద్ధపడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో, టీవీ ఇంటర్వ్యూల్లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను అవమానపరుస్తూ, రాజ్యాంగాన్ని వక్రీకరిస్తూ మాట్లాడుతున్న హమారా



ప్రసాద్ అలియాస్ నాగులపురం వరప్రసాద్ పై వెంటనే దేశద్రోహిగా కేసు నమోదు చేసి, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచినందుకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, మండల అధ్యక్షులు దార స్వామి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల చంద్రం, జిల్లా నాయకులు దార మల్లయ్య, మద్దెల మంకయ్య, మద్దెల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా హక్కుల పరిరక్షణలో పోలీసులు ముందుండాలి

- **తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో సీపీ సాధన రష్మీ పెరుమాళ్**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం సీపీ సాధన రష్మీ పెరుమాళ్, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా లభించిందని తెలిపారు. వారు సాధించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడే బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉందన్నారు. ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జీవించేందుకు పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల హక్కులను పరిరక్షించడంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుండాలని సూచించారు. విధుల నిర్వహణలో పూర్తి నిష్పాక్షికత, తటస్థత పాటించాలని ఆదేశించారు. రాజ్యాంగం కల్పించిన అధికారాలను దుర్వినియోగం చేయకుండా, ప్రజలకు ఆత్మవిశ్వాసంతో, నిష్పాక్షికంగా సేవలందించాలన్నారు. ప్రజాసేవ పట్ల తమకున్న నిబద్ధతను మరోసారి గుర్తుచేసుకునేందుకు ప్రజా పాలన దినోత్సవం ఒక మంచి సందర్భమని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, ఇన్స్పెక్టర్ కిరణ్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల బ్రహ్మోత్సవాల్లో హిమగిరి అకాడమీ కళాకారుల నృత్య వైభవం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
తిరుమల తిరుపతి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా గురువారం రెండవ రోజు ఉదయం స్వామివారు సింహవాహనంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల "గోవిందా.. గోవిందా.." నామ స్మరణలతో తిరుమల కొండలు మార్మోగగా, ఆధ్యాత్మిక వాతావరణం మరింత భక్తిభావంతో నిండిపోయింది. ఈ సందర్భంగా తిరుపతి సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ కళా ప్రతిభను ప్రదర్శించారు. సాంప్రదాయ నృత్యాలు, సంగీత కచేరీలతో కళాకారులు భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేటకు చెందిన హిమగిరి డాన్స్ అకాడమీ 23 మంది యువ కళాకారులు పాల్గొని అద్భుతమైన నృత్య ప్రదర్శన ఇచ్చారు. భారతీయ సాంప్రదాయ నృత్య కళా వైభవాన్ని ప్రతిబింబించేలా సాగిన వారి ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారి సన్నిధిలో నృత్య ప్రదర్శన చేసే అవకాశం లభించడం తమకు ఎంతో దివ్యమైన అనుభూతిని కలిగించిందని కళాకారులు తెలిపారు. ఈ ప్రదర్శనకు అవసరమైన సంగీత సహకారం అందించిన తిరుపతి సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల గారు, కృత్య గురువు శరత్ చంద్రకు హిమగిరి డాన్స్ అకాడమీ తరపున గురువులు సుజన యాదవ్, గోపి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కళా ప్రదర్శన అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులందరినీ తిరుమల తిరుపతి దేవస్థానం తరపున తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. హిమగిరి డాన్స్ అకాడమీ తరపున ఈ నృత్య ప్రదర్శన భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, కళాభిమానులకు ప్రత్యేక అనుభూతిని అందించింది. భవిష్యత్తులో కూడా స్వామివారి సన్నిధిలో ఇలాంటి దివ్యమైన కళా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం మరిన్ని సార్లు లభించాలని అకాడమీ గురువులు, కళాకారులు ఆకాంక్షించారు.

# గణనాథుని సన్నిధిలో కాల్వ సుజాత

- **ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
గణనాథుని నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం సంఘం భవనంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కాల్వ సుజాత హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రముఖ సంఘ సేవకులు, అక్షయ మెడికల్ ఏజెన్సీ అధినేత బాదం శంకర్ గుప్తా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పార్శి ప్రకాష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి దొంతుల అన్నయ్య గుప్తా, రాష్ట్ర మహాసభ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఉప్పల చంద్రశేఖర్ గుప్తా, కోశాధికారి పవన్ గుప్తా, మండల అధ్యక్షులు వాసం శ్రీనివాస్ గుప్తా, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ రేగూరి ప్రవీణ్ గుప్తా, అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్తా, జిల్లా మాజీ కోశాధికారి దారం సతీష్ గుప్తా, యువజన విభాగం అధ్యక్షులు పబ్బా నరేష్, ప్రధాన కార్యదర్శి లింగ వేణు గోపాల్, కోశాధికారి రమాకాంత్, పి.శ్రీధర్, సంఘం సభ్యులు, మహిళా విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# త్యాగధనుల స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలి

**పతాకావిష్కరణలో ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**మానకొండూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా గురువారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం) లో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించేందుకు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ విమోచన కోసం పోరాడిన త్యాగధనుల స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. వారి త్యాగాలను వృథా కానివ్వకుండా తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పొన్నాల సంపత్, పార్టీ నాయకులు దావు సంపత్ రెడ్డి, బుధారపు శ్రీనివాస్, మర్రి ఓదెలు యాదవ్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, బండి మల్లేశం గౌడ్,రేవెల్లి రాజలింగం, సాయిరి దేవయ్య, మేడి అంజయ్య, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, అట్ల అనిల్, రెడ్డిగారి రాజు, రావుల కృష్ణ, తాళ్లపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# విశ్వకర్మ ఆరాధనోత్సవాల్లో ముఖ్య అతిథిగా వంగ రాజేశ్వర్ రెడ్డి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
సిద్దిపేట పట్టణంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విశ్వకర్మ ఆరాధనోత్సవాల ఐదవ వార్షికోత్సవ కార్యక్రమానికి యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం విశ్వకర్మ సంఘం సభ్యులు, నిర్వాహకులతో ఆత్మీయంగా ముచ్చటించారు. విశ్వకర్మ సమాజం ఆధ్యాత్మిక, సామాజిక, వృత్తిపరమైన రంగాల్లో అందిస్తున్న సేవలను వంగ రాజేశ్వర్ రెడ్డి అభినందించారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం , సభ్యులు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవన్ స్థల పరిశీలన చేసి మంత్రి అడ్లూరి



**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 17, :**
కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ భవన్ కు కేటాయించిన స్థలాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అధికారులతో కలిసి పరిశీలించారు. భగత్ నగర్ లోని సర్వే నెంబర్ 1104/22 లో గల స్థలంలో అన్ని వసతులతో అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. హైదరాబాద్ స్థాయిలో అన్ని వసతులు కల్పించి విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడే విధంగా భవన నిర్మాణం చేయడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోయిల్ సాగర్ సాగునీటి విడుదలకు మంత్రి శ్రీహరి ఆదేశాలు

**రైతుల విజ్ఞప్తికి మంత్రి తక్షణ స్పందన**

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
కోయిల్ సాగర్ రిజర్వాయర్ కింద ఉన్న సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని గురువారం రైతులు మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. రైతుల విజ్ఞప్తిపై మంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పిలిపించి సాగునీటి విడుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు నష్టపోయే పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. ఎల్ నినో ప్రభావం పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం రైతులు పంటలు సాగు చేసుకునేందుకు అవసరమైన నీటిని అందుబాటులో ఉంచేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి సాగుకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు.



# ఎస్పీ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**



తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఏఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్, కరుణాకర్, లక్ష్మీ నారాయణ, రాజ్ కుమార్, శ్రీధర్, ఆర్ఐ వేణు, ఎస్ఐలు, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

- శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** విశ్వకర్మ జయంతి సందర్భంగా జీడిమెట్ల ఎన్నా చెరువు వద్ద ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఉద్యమకారులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, వీరారెడ్డి నరేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు, సభ్యులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, ఐశ్వర్యం, ఆనందంతో జీవించాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆకాంక్షించారు.



# ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి పూజ, అన్నదానం



- పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్

**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** జగిత్యాల పట్టణంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గణపతి పూజా కార్యక్రమం, అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ పరిధి ప్రకారమే షాపింగ్ మాల్స్ చిరునామాలు ఉండాలి

- జీడిమెట్ల, పేట్‌బషీరాబాద్ పరిధిలోని సంస్థలకు 'కొంపల్లి' చిరునామా వినియోగాన్ని అరికట్టాలి : దమ్మని శ్రవణ్ కుమార్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** సుచిత్ర చౌరస్తా నుంచి కొంపల్లి గ్రామ బౌండరీ వరకు జాతీయ రహదారి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపింగ్ మాల్స్, సినిమా ప్లాట్స్, ఆసుపత్రులు, వాణిజ్య సంస్థలు ఆయా రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి చిరునామాలను 'కొంపల్లి' పేరుతో పేర్కొంటున్నారని మాజీ మేడ్చల్–మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. జీడిమెట్ల, పేట్‌బషీరాబాద్ గ్రామాల రెవెన్యూ పరిధిలో ఉన్న షాపింగ్ మాల్స్, వాణిజ్య సంస్థలు కొంపల్లి చిరునామాను వినియోగించడం వల్ల ఆయా గ్రామాల ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఏ సంస్థ ఏ రెవెన్యూ గ్రామ పరిధిలో ఉందో అధికారికంగా పరిశీలించి, అదే గ్రామం పేరుతో చిరునామా పేర్కొనేలా తగిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను దమ్మని శ్రవణ్ కుమార్ కోరారు. రెవెన్యూ పరిధులకు అనుగుణంగా చిరునామాల వినియోగంపై స్పష్టమైన చర్యలు చేపట్టి, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.



# ప్రజా పాలనతో ప్రజల సమస్యలకు పరిష్కారం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా పాలన లక్ష్యమని రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట ఐడీఓసీలో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతం నిజాం పాలన నుంచి విముక్తి పొంది భారతదేశంలో అంతర్భాగమైన చారిత్రాత్మక రోజని అన్నారు. నాటి తెలంగాణ ప్రజల త్యాగాలు, పోరాటాలు, స్వాభిమాన ఆకాంక్షలు నేటి తరానికి



స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజా ప్రభుత్వం సంక్షేమం, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, విద్య, వైద్యం, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలన, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్ తెలంగాణ అభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్–2047' దార్శనిక ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లాను ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు, వైద్య, పారిశుధ్య సిబ్బంది, మీడియా ప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కట్టా హైమవతి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్, అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, అదనపు డీసీపీలు సుభాష్ చంద్రబోస్, కుశాల్కర్, ఆర్టీఏ కమిటీ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్, మున్సిపల్ కమిషనర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 22/ఏ నిషేధిత జాబితా నుంచి కాలనీల స్థలాలను తొలగించాలి

- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ వినతి

**మేడ్చల్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని పద్మానగర్, మారుతినగర్ కాలనీలకు చెందిన ఇళ్ల స్థలాలను 22/ఏ ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చిన అంశాన్ని పరిష్కరించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు గురువారం జిల్లా కలెక్టర్ మనో చౌదరిని కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. 22/ఏ నిషేధిత జాబితాలో ఉన్న పద్మానగర్, మారుతినగర్ కాలనీల స్థలాలను సమగ్రంగా పరిశీలించి, న్యాయపరంగా అర్హత ఉన్న స్థలాలను జాబితా నుంచి తొలగించి కాలనీవాసులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. గత ప్రభుత్వ హయాంలో 22/ఏ జాబితాలో చేర్చిన భూముల వివరాలను కూడా పరిశీలించి, అర్హత ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అనుమతులు, సంబంధిత ఆధారాలు ఉన్నప్పటికీ కాలనీవాసుల ఇళ్ల స్థలాలను 22/ఏ జాబితాలో చేర్చడం వల్ల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి అసెంబ్లీలో సానుకూలంగా స్పందించి, న్యాయపరంగా అర్హత ఉన్న స్థలాలను జాబితా నుంచి తొలగించేందుకు కృషి చేస్తామని ప్రకటించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసుల విజ్ఞప్తిపై కలెక్టర్ మనో చౌదరి సానుకూలంగా స్పందించి, సంబంధిత ఆర్డీవో, ఎమ్మార్వో అధికారులకు స్థలాలకు సంబంధించిన వివరాలను పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించినట్లు శ్రీశైలం గౌడ్ తెలిపారు.



తమ సమస్యపై సానుకూలంగా స్పందించిన మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, జిల్లా కలెక్టర్ మనో చౌదరికి పద్మానగర్, మారుతినగర్ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, కాలనీవాసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన బిక్షపతి యాదవ్

- నిజాంపేట బస్టాండ్ వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ.. అమరవీరులకు నివాళులు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజాంపేట సర్కిల్ పరిధిలోని నిజాంపేట బస్టాండ్ వద్ద బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం లభించినప్పటికీ హైదరాబాద్ సంస్థాన పరిధిలోని తెలంగాణ ప్రాంతం నిజాం పాలనలోనే కొనసాగిందన్నారు. నిజాం రజాకార్ల దౌర్జన్యాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ప్రజల పోరాటం, సర్దార్ వల్లభభాయ్ పటేల్ చొరవతో చేపట్టిన



పోలీస్ చర్య అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని తెలిపారు. తెలంగాణ విమోచన కోసం పోరాడి అమరులైన వారిని స్మరించుకోవడంతో పాటు, విమోచన దినోత్సవ ప్రాధాన్యతను ప్రస్తుత తరంతో పాటు భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**మోదీ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు**

జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిజాంపేట హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని, భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత చాటిచెప్పేలా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సచిన్, శ్రీనివాస్ గుప్తా, సీనియర్ నాయకులు రచ్చ చక్రధర్, బీజేవైఎం అధ్యక్షులు ఎన్.ఆర్.కె. ముదిరాజ్, ఉపాధ్యక్షులు సాయికిరణ్, ఓబీసీ అధ్యక్షులు వెంకటేష్ ముదిరాజ్, లీగల్ సెల్ కన్వీనర్ అప్పారావు, మల్లేష్ గౌడ్, నాయకులు సతీష్, కృష్ణ, పాండు, కిషన్, ఈశ్వరరావు, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనతో ప్రతి ఒక్కరికీ న్యాయం

- డీసిసి ప్రెసిడెంట్ గాజంగి నందయ్య
- పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడవాల జ్యోతి లక్ష్మణ్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తహసీల్ చౌరస్తా వద్ద జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో జాతీయ జెండా పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రజలు చేసిన పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా పాలనను ప్రతి గడపకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆమె విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందించే చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, బాల ముకుందం, బండ శంకర్, కూసరి అనిల్, కౌన్సిలర్ పిట్ట ధర్మరాజు, దూమాల రాజ్ కుమార్, గుండారం సాయికుమార్,



సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండా, బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** మేడ్చల్ జిల్లా గండిమైసమ్మలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జాతీయ జెండాతో పాటు బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన



ఉద్యమాలు, ప్రజల ఐక్యత, త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాం నిరంకుశ పాలనను కీర్తించడం తెలంగాణ అమరవీరుల త్యాగాలను అవమానించడమే

- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్**

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పంతో నిజాం రాక్షస పాలన నుండి మనం స్వేచ్ఛను సాధించుకుంటే.. నేడు కొందరు నాయకులు అదే నిజాంను గొప్పవాడిగా కీర్తించడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ అన్నారు. తెలంగాణా విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని దుబ్బాక ఛత్రపతి శివాజీ చౌరస్తాలో ఆయన గురువారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలేష్ గౌడ్ మాట్లాడుతూ పరకాలలో జాతీయ జెండా ఎగరేసి 'వందేమాతరం' అన్నందుకు, వీరభైరాన్‌పల్లిలో స్వేచ్ఛ కోసం పోరాడినందుకు ఆనాడు సామాన్య ప్రజలను బలితీసుకుంది ఎవరో.. అసెంబ్లీ సాక్షిగా నిజాంను పొగుడుతున్న వారు సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ధన, మాన ప్రాణాలను దోచుకుని రక్తాన్ని కళ్ల జూసిన నిజాంను గొప్పవాడిగా చిత్రీకరిస్తూ అసెంబ్లీలో మాట్లాడటం సిగ్గు చేటని, నిజాంను పొగిడే నాయకులారా.. వీర బైరాన్ పల్లి, పరకాల, గుండ్రాంపల్లి, నిర్మల్ వెయ్యి ఊడల మర్రిలో వేలాది మంది చావులకు కారణం ఎవరో ఆలోచించాలన్నారు. నియంత నిజాం నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని నేడు ప్రభుత్వం అధికారికంగా తెలంగాణా వ్యాప్తంగా నిర్వహించాల్సిన విమోచన దినోత్సవ వేడుకలను ఒక వర్గం ఓట్లకోసం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారిస్తుందని, తెలంగాణా విమోచన చరిత్రని వక్రీకరిస్తుందని అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, విమోచన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని బీజేపీ గత 20 సంవత్సరాలుగా పోరాటం చేస్తుందని



అన్నారు. కేంద్ర ప్రభుత్వం భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో తెలంగాణా విమోచన దినోత్సవాన్ని గత ఐదు సంవత్సరాలుగా అధికారికంగా నిర్వహిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు గొల్ల శ్రీకాంత్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్ కనకరాజు, నాయకులు గాజుల భాస్కర్, బోయ రాజశేఖర్, వెంకట్ గౌడ్, సుంకు ప్రవీణ్, తోగుట రవీందర్, రమేష్ రెడ్డి, రమణా రెడ్డి, నక్క శ్రీనివాస్, నేహాల్ గౌడ్, బాలుగారి చంద్రకాంత్, పల్లె మనోజ్, బాపురాజు, బైండ్ల నారాయణ, కారంకంటి రాజు, కోదారి శ్రీకాంత్, కొంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132వ జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్‌లో గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీర తెలంగాణ యోధుల త్యాగాలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. వారి పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ, అంజయ్య, వీరేశం, సతీష్ చక్రవర్తి, ఎశ్వంత్, నవీన్ రెడ్డి, పాపయ్య దొర, శ్రవణ్ బోస్, క్రాంతి, శ్రవణ్, రాజు, మహేష్, మూర్తి, శివ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా

- **మల్లంపేటలో జాతీయ జెండా ఎగురవేసిన బీజేపీ నాయకులు**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని దుండిగల్ మున్సిపల్ పరిధిలోని మల్లంపేట పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ విమోచన పోరాటంలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలన నుంచి విముక్తి కోసం ప్రజలు సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో కీలక ఘట్టమని పేర్కొన్నారు. 1946 నుంచి 1948 వరకు సాగిన సాయుధ పోరాటంతో పాటు కవులు, కళాకారులు, రచయితలు, వివిధ రాజకీయ, ప్రజా సంఘాలు ప్రజలను సమీకరించి చేసిన పోరాటాలు తెలంగాణ విమోచన ఉద్యమంలో భాగమని వివరించారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, బందగి తదితరులు తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి అమరులయ్యారని, వారి త్యాగాలను భవిష్యత్ తరాలు స్మరించుకోవాలని అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సెంట్రింగ్ నరసింహ, జై కిషన్, సార నవీన్, మేడ్చల్ దళిత మోర్చా ఉపాధ్యక్షుడు ఎస్. నర్సింగరావు, బీజేవైఎం నాయకుడు సోను అతిష్ బాబు, బీజేపీ 32వ బూత్ ఇన్‌చార్జ్ గణేష్ ముదిరాజ్, ఇందిరమ్మ కాలనీ గణేష్, లక్ష్మారెడ్డి, రాములు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు కార్యక్రమానికి హాజరయ్యారు.

# జేకే శేఖర్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన న్యూ రాజీవ్ గాంధీ నగర్ కమిటీ సభ్యులు



- **బస్తీ సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** న్యూ రాజీవ్ గాంధీ నగర్ నూతన కమిటీ సభ్యులు బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జేకే శేఖర్ యాదవ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మధుసాగర్ ఎన్నికైన సందర్భంగా శేఖర్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి, తమకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా జేకే శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కమిటీ సభ్యులు నిరంతరం ప్రజల తరపున పోరాడాలని సూచించారు. బస్తీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి కూడా తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులందరినీ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులు మధుసాగర్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు కిషోర్, రాములు, రాజు, నాగ తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో ఘనంగా అంతర్జాతీయ హౌస్ కీపింగ్ వారోత్సవాలు

**పటాన్చెరు, సెప్టెంబర్ 17, :** ప్రతి శుభ్రమైన ప్రదేశం వెనుక అంకితభావంతో పనిచేసే బృందం ఉంటుందనే సందేశంతో హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ హౌస్ కీపింగ్ వారోత్సవాలు–2026 ఘనంగా నిర్వహించారు. హౌస్ కీపింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం సేవా స్ఫూర్తి, అంకితభావం, బాధ్యతకు ప్రతీకగా నిలిచింది.విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా, ఆహ్వానించదగినదిగా ఉంచేందుకు తెరవెనుక నిరంతరం శ్రమించే హౌస్ కీపింగ్ సిబ్బంది సేవలను ఈ సందర్భంగా గుర్తించి అభినందించారు. వారి పని చాలాసార్లు కనిపించకపోయినా, ప్రతి పనిని సజావుగా నిర్వహించడంలో వారి పాత్ర ఎంతో కీలకమని వక్తలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు హౌస్ కీపింగ్ బృందం నిబద్ధత, బాధ్యతాయుత సేవలను ప్రశంసించారు. రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ మాట్లాడుతూ సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన ప్రాంగణ అనుభవాన్ని అందించడంలో హౌస్ కీపింగ్ సిబ్బంది కృషి అమూల్యమని కొనియాడారు.గణేశ వందనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం వారం రోజుల పాటు నిర్వహించిన వేడుకలకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. వినోదభరితమైన ఆటలు, బహుమతుల పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు హౌస్ కీపింగ్ బృంద




సభ్యుల్లో ఉత్సాహాన్ని నింపాయి.తేనీటి విందుతో కూడిన ఆత్మీయ సమావేశంతో వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా హౌస్ కీపింగ్ సిబ్బంది తమ సేవలకు లభించిన గుర్తింపు, గౌరవంతో ఆనందం వ్యక్తం చేశారు. గొప్ప సేవ అంటే ఎల్లప్పుడూ కనిపించడం కాదని, శ్రద్ధ, నిబద్ధత, నిరంతర కృషితో ప్రతి అనుభవాన్ని సాఫీగా, అంతరాయాలు లేకుండా చేయడమేనని కార్యక్రమం చాటి చెప్పింది.

# భక్తిశ్రద్ధలతో బలగణేష్ యూత్ అన్నదానం

- **ప్రత్యేక పూజల్లో పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** సుభాష్‌నగర్ డివిజన్‌లో బలగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వినాయక మండపం వద్ద స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పోలె శ్రీకాంత్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బలగణేష్ యూత్ సభ్యులు పోలె శ్రీకాంత్‌ను శాలువాతో సత్కరించి, తమకు అందిస్తున్న సహాయ సహకారాలు భవిష్యత్తులోనూ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అడపా శేషు, మోహన్, కమిటీ సభ్యులు నరేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, షేకర్, శ్రీను, వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సృజన లక్ష్మీనగర్‌లో సీసీ రోడ్డు పనుల పరిశీలన

- **కాలనీవాసుల సమస్య పరిష్కారానికి శశిధర్ రెడ్డి చొరవ**
- **అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి కృషితో రోడ్డు పనులు ప్రారంభం**



**అమీన్పూర్, సెప్టెంబర్ 17, :** సంగారెడ్డి జిల్లా సీఎంసీ పరిధిలోని బీరంగూడ డివిజన్ సృజన లక్ష్మీనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి పరిశీలించారు. గత కొంతకాలంగా కాలనీలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.కాలనీవాసుల విజ్ఞప్తికి స్పందించిన శశిధర్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ సూచనల మేరకు సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొని సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు.రోడ్డు పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డికి కాలనీ ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని శశిధర్ రెడ్డి తెలిపారు.

# తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా

- **వీర తెలంగాణ యోధుల త్యాగాలను స్మరించుకుందాం: సాయినాథ్ నేత**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఉమ్మడి గాజులరామారం డివిజన్ పరిధిలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రోడ మేస్త్రి నగర్‌లో బీజేపీ సీనియర్ నాయకులు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో, లెనిన్ నగర్‌లో లక్ష్మణ్, ధర్మేష్ ఆధ్వర్యంలో, చంద్రగిరి నగర్ చౌరస్తాలో డివిజన్ సీనియర్ నాయకులు సాయి ప్రతాప్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉమ్మడి గాజులరామారం డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి స్వేచ్ఛ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన వీర తెలంగాణ యోధుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. వారి ధైర్యం, పోరాట స్ఫూర్తి, త్యాగాలను భావితరాలకు అందిస్తూ స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా ఓబీసీ మోర్చా ఇన్‌చార్జ్ భానుచందర్, జిల్లా మాజీ కార్యవర్గ సభ్యులు సునీల్ పాటిల్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మాజీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్ రెడ్డి, గాజులరామారం డివిజన్ కార్యదర్శి జి. శ్రీనివాస్, సీనియర్ నాయకులు నరేష్ గౌడ్, సాయి ప్రతాప్, వసుంధర, యువ మోర్చా ఉపాధ్యక్షులు ధర్మేష్, లక్ష్మణ్, పులి రాజు, నాగరాజు చారి, లక్ష్మణ్ గౌడ్, రాజేష్ కన్నా, మురళి గౌడ్, అమర్, బాలరాజు, అశోక్, బాలు నేత తదితరులు పాల్గొన్నారు.



## మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- రక్తదానం చేసిన కార్యకర్తలను అభినందించిన ఎంపీ ఈటల రాజేందర్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై స్వయంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఎంపీ ఈటల రాజేందర్ అభినందించారు. మరో ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు హాజరయ్యారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జేకే శేఖర్ యాదవ్‌తో పాటు బీజేపీ రాష్ట్ర, జిల్లా పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 17, :**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ శివానందం మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం లభించినప్పటికీ, తెలంగాణ ప్రాంతానికి 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన, రజాకార్ల నుంచి విముక్తి లభించిందన్నారు. తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న చారిత్రక రోజుగా సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజశేఖర్, డైరెక్టర్లు సందీప్, సతీష్ గౌడ్, శ్రీనివాస్, అబ్దుల్ హమీద్, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరులో గణనాథుడిని దర్శించుకున్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 17, :**
పటాన్‌చెరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



**జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 17, :**
సృష్టికి మూలకర్త, దేవ శిల్పి అయిన భగవాన్ విశ్వకర్మ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు లత, రాజగౌడ్‌లు భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగవాన్ విశ్వకర్మను సృష్టికి మూలకర్తగా, దేవ శిల్పిగా భక్తులు కొలుస్తారని, ప్రతి సంవత్సరం కన్యా సంక్రాంతి సందర్భంగా విశ్వకర్మ జయంతిని జరుపుకుంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచం మెచ్చిన నేత ప్రధాని మోడీ





- ఎంపీ మాధవనేని రఘునందన్ రావు
- ప్రధాని జన్మదిన సందర్భంగా వెంకటేశ్వర ఆలయం వద్ద ఆశీర్వాద దీపం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
ప్రపంచం మెచ్చిన నేత ప్రధాని నరేంద్ర మోడీ అని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. ప్రధాని మోడీ 76వ జన్మదినం, ఆయన 25 ఏళ్ల ప్రజాసేవ పురస్కరించుకొని గురువారం సిద్దిపేట వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి "ఆశీర్వాద దీపం" వెలిగించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రధాని దీర్ఘాయువు, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ అధినేతగా ప్రజా జీవితంలో మోడీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు. 2001 అక్టోబర్ 7న తొలిసారి గుజరాత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మోదీ, ఆ తర్వాత 2014 నుండి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి నిరంతరాయంగా పావు శతాబ్ద కాలం పాటు అధికారంలో కొనసాగుతూ అరుదైన రికార్డు సృష్టించారన్నారు. డిజిటల్ గవర్నెన్స్, ఉచిత వ్యాక్సినేషన్, ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన నిర్ణయాలతో అంతర్జాతీయ వేదికలపై భారతదేశ కీర్తిని పెంచేలా చేశారని కొనియాడారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో సుదీర్ఘ కాలం పాటు నిరంతరాయంగా ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, దేశానికి ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ఏకైక ప్రజాస్వామ్య నేతగా మోదీ నిలిచారని ప్రశంసించారు. కరోనా కష్టకాలం నుండి ఇప్పటి వరకు పేదలకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత మోదీ ప్రభుత్వానిదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, బాసంగారి వెంకట్, కాసనిగొట్టు సంతోష్, విభీషణ్ రెడ్డి, తుంగ కనకయ్య, కొత్తపల్లి వేణుగోపాల్, గుండ జనార్ధన్, మీడియా ఇన్చార్జి గోనె మార్కండేయులు, పద్మ, ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవంలో బీజేపీ నేత భరత్ సింహ రెడ్డి

- ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జీడిమెట్ల గ్రామం బ్రహ్మంగారి గుట్ట వద్ద ఉన్న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి యజ్ఞ మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కృష్ణమాచారి, సంతోష్ చారి, వెంకటేష్ చారి, శేఖర్ చారి, రాజేష్ చారి, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల్ కృష్ణ, సతీష్ చక్రవర్తి, నాగదీప్ గౌడ్, పాపయ్య దొర, మహేష్, వర్మ, శివ, హేమంత్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## రామ్ నగర్ రామ్ మందిర్ గణపతి వేడుకల్లో అలరించిన సంగీత విభావరి

- భక్తి గీతాలు ఆలపించిన సినీ నేపథ్య గాయకులు
- మండపంలో డోలక్ వాయిస్తూ భజన పాటలు పాడిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 17, :**
గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి రాంనగర్ రామ్ మందిర్ లో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద బుధవారం రాత్రి సంగీత విభావరి ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ నేపథ్య గాయకులు భక్తి గీతాలు ఆలపించి భక్తులను అలరించారు. అంతకుముందు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గణపతి మండపంలో డోలక్ వాయిస్తూ భజన పాటలు పాడారు. ఓవైపు భక్తి గీతాలు మరోవైపు భజన పాటలతో రామ్ మందిర్ ప్రాంతం



మార్మోగింది. గురువారం తెల్లవారుజాము వరకు ఈ సంగీత విభావరి కార్యక్రమం అట్టహాసంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డితో పాటు సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మల




జగ్గారెడ్డి, జయా రెడ్డి పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# పారదర్శక పాలనతో ప్రజలకు చేరువవుతున్న ప్రభుత్వం

## తొగుట ఏఎంసీలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

- ఏఎంసీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి

**తొగుట, సెప్టెంబర్ 17, :**
రాష్ట్రంలో పారదర్శక పాలనతో ప్రభుత్వం ప్రజలకు చేరువవుతుందని, అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ ప్రజా పాలన కొనసాగిస్తున్నారని తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి స్పష్టం చేశారు. తొగుట మార్కెట్ యార్డ్‌లో గురువారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన దినోత్సవం ప్రజాస్వామ్య విలువలను, ప్రజలకు పారదర్శకమైన పరిపాలన అందించే లక్ష్యాలను గుర్తు చేస్తుందని అన్నారు. రైతులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి సమాజ అభివృద్ధికి మరింత కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, అధికారులు, మార్కెట్ వైస్ చైర్మన్ నర్సింలు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## కొడిమ్యాల ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**చొప్పదండి/కొడిమ్యాల, సెప్టెంబర్17, :**
తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కొడిమ్యాల మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ డి. నరేష్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిడిఓ ఇ. స్వరూప, వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ అధికారిణి పి. జ్యోతి, మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిపాలన ప్రాధాన్యతను వివరించారు. ప్రజల సంక్షేమం,అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





చురకలు



# ఆవిసె గింజలు తింటే.. అద్భుతాలు



ప్రస్తుతం ఆరోగ్యంపై చాలా మందికి అవగాహన పెరుగుతోంది. దీంతో తీసుకునే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పడుతున్నారు. ఇందులో భాగంగానే రెగ్యులర్ ఫుడ్‌తో పాటు ఆరోగ్యానికి మేలు చేసే సీడ్స్‌ను తీసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి సీడ్స్‌లో ఆవిసె గింజలు ఒకటి. ఇందులోని ఎన్నో ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతీ రోజూ ఒక స్పూన్ ఆవిసె గింజలను తీసుకోవడం వల్ల శరీరంలో వచ్చే మార్పులు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

అవిసె గింజల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్,, థయామిన్, కాపర్, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా చేస్తాయి. అలాగే ఇందులోని బి కాంప్లెక్స్ విటమిన్లు, విటమిన్ ఇ, మెగ్నీషియం చర్మ సంరక్షణతో పాటు ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇందులో మెగ్నీసియం రక్తపోటును కంట్రోల్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అంటున్నారు. శరీరంలో రక్త కణాల ఉత్పత్తిలో కూడా అవిసె గింజలు ఉపయోగపడతాయని నిపుణు అంటున్నారు.

ఇక జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి కూడా ఇవి బాగా ఉపయోగపడతాయి. దీనికి కారణం ఇందులోని ఫైబర్ కంటెంట్. అవిసె గింజల్లో పుష్కలంగా ఉండే ఫైబర్ కంటెంట్ మెరుగైన జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది. అలాగే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో గుండె ఆరోగ్యానికి ఇది మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. గుండె పోటు వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి. ఈ గింజల్లో ఉండే.. యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను అంతం చేస్తాయి. ఫలితంగా కేన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది. డయాబెటిస్ సమస్య బారిన పడకుండా ఉండాలంటే కచ్చితంగా ప్రతీరోజు అవిసె గింజలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులోని ఫైబర్ కంటెంట్ రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా అడ్డుకుంటాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. క్రమం తప్పకుండా వీటిని తీసుకుంటే రెగ్యులర్ వ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.





# మసాలా టీ.. ఇంట్లోనే చేసుకోండి ఇలా..!

మసాలా టీ అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి.. కానీ ఈ టీ తాగాలంటే ఏదైనా ఫేమస్ కేఫ్ కు వెళ్లాల్సిందే. అది కూడా జనం అరుపులు, కేకలు వింటూ తాగాలి. ఇంట్లోనూ మనం నిత్యం టీ చేసుకొని తాగుతాం.. కానీ మసాలా టీ( అల్లంటీ) లాంటి రుచి ఇంట్లో చేసుకుంటే రాదు. అయితే ఇంట్లోనే అల్లం టీ లేదా మసాలా టీ ఎలా చేసుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. మీరు గనక ఇక్కడ చెప్పినట్టు టీ కాచుకుంటే అచ్చం ఇరానీ టీ టేస్ట్ వచ్చి తీరుతుంది.

## కావాల్సిన పదార్థాలు:

- పావు లీటర్ పాలు
- రెండు టేబుల్ స్పూన్ అల్లం తురుము
- మూడు టేబుల్ స్పూన్ల టీ పొడి
- నాలుగు లవంగాలు
- అయిదు యాలకులు
- రెండు టేబుల్ స్పూన్ల గులాబీ రెబ్బలు
- ఒక చిన్న ముక్క దాల్చినా చెక్క

ముందుగా పెనంపై టీ కాచే గిన్నెను పెట్టుకొని అందులో పాలు పోసి, పాలు ఒక పొంగు వచ్చే వరకు మరిగించుకోవాలి. అనంతరం ఆ పాల గిన్నెను పక్కన పెట్టుకోవాలి. తర్వాత ఒక చిన్న పాత్ర తీసుకొని అందులో రెండు గ్లాసుల నీళ్లు పోసుకోవాలి. ఆ నీళ్లు కొంచెం మరిగాక.. అందులోనే కచ్చాపచ్చాగా దంచుకున్న యాలకులు, అల్లం తురుము, లవంగాలు, దాల్చిన చెక్కను వేసి కాసేపు మరిగించుకోవాలి. తరువాత బాగా మరిగిన ఆ డికాషన్ లో టీ పొడి, సరిపడా చెక్కర వేసుకొని.. రెండు నిమిషాల పాటు బాగా మరిగించుకోవాలి. డికాషన్ బాగా మరిగిన తరువాత.. ఇందులో మనం ముందుగానే వేడి చేసి పెట్టుకున్న పాలను పోసుకోవాలి. అలాగే రెండు టేబుల్ స్పూన్ల గులాబీ రెబ్బలను కూడా కలుపుకోవాలి. గులాబీ రెబ్బలను టీలో కలుపుకోవడం ద్వారా టీ మంచి రుచిగా ఉండడంతో పాటు చిక్కగా, సువాసన భరితంగా ఉంటుంది. తరువాత స్టవ్ ను మీడియం మంటలో ఉంచుకొని.. గరిటెతో టీని కలుపుతూ అయిదు నిమిషాల పాటు బాగా మరిగించుకోవాలి. అంతే పొగలు కక్కే అల్లం టీ సిద్ధమైపోతుంది.



# బిర్యానీ తింటూ, కూల్ డ్రింక్ తాగుతున్నారా..?



వెడి వెడిగా చికెన్ బిర్యానీ తింటూ.. కూల్‌కూల్‌గా కూల్ డ్రింక్ తాగితే.. అబ్బా ఆ మజానే వేరు అని చాలా మంది భావిస్తుంటారు. బిర్యానీ లాగిస్తూ, కూల్ డ్రింక్ సిప్ చేస్తూ చిల్ అవుతుంటారు. అయితే ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. నిజానికి కూల్ డ్రింక్ తాగడం ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని తెలిసిందే. అందులోనూ బిర్యానీ తింటూ, కూల్ డ్రింక్ తాగడం మరింత మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ కూల్‌డ్రింక్ తాగుతూ.. బిర్యానీ తినడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..

* బిర్యానీ తింటూ కూల్ డ్రింక్ తాగితే కడుపులో ఆమ్లత్వం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా బిర్యానీ లాంటి మసాలాలు ఎక్కువగా ఉండే ఫుడ్ తీసుకుంటే కడుపులో గ్యాస్ట్రిక్ యాసిడ్ విడుదలవుతుంది. దానికి తోడు కూల్ డ్రింక్ తీసుకుంటే అందులోని యాసిడ్స్ జీర్ణ వ్యవస్థలో ఆమ్లాన్ని మరింత పెంచుతుంది. దీంతో ఇది గ్యాస్, గుండెలో మంట సమస్యకు దారి తీస్తుందని అంటున్నారు. మొదట్లో బాగానే అనిపించినా దీర్ఘకాలంలో మాత్రం తీవ్ర సమస్యలకు దారి తీస్తుంది.

* జీర్ణ సంబంధిత సమస్యలకు సైతం ఇది దారి తీస్తుందని నిపుణులు అంటున్నారు. కూల్ డ్రింక్‌లో ఉండే కార్బనేషన్ జీర్ణక్రియపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది అజీర్తి, పొట్టలో నొప్పి, ఉబ్బరం వంటి సమస్యలకు కారణమవుతుంది.

* మధుమేహంతో బాధపడేవారికి ఇది మరింత ప్రమాదానికి కారణమవుతుంది. బిర్యానీలో ఉండే కార్బోహైడ్రేట్స్, కొవ్వులు.. కూల్ డ్రింక్స్‌లో ఉండే అధిక చక్కెర స్థాయిలు రక్తంలో షుగర్ లెవల్స్ పెరగడానికి కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

* కూల్ డ్రింక్స్‌లో అధిక చక్కెరలు, ప్రిజర్వేటివ్‌లు ఎక్కువగా ఉంటాయి. ఇవి లివర్‌తో పాటు కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుంది. బిర్యానీలో ఉన్న ప్రోటీన్లు, కొవ్వులు శరీరానికి అధిక శక్తిని ఇస్తాయి. కూల్ డ్రింకులతో పాటు తీసుకోవడం వలన శరీరంలో టాక్సిన్ లు ఎక్కువ అవుతాయి, ఇది కాలేయంతో పాటు కిడ్నీ పనితీరును ప్రభావితం చేస్తుంది.

* కూల్ డ్రింక్స్‌లో అధికంగా ఉండే చక్కెరలు, కేలరీలు శరీరంలో కొవ్వు పెరగడానికి కారణమవుతాయి. అలాగే బిర్యానీలోని కొవ్వు ఒబేసిటీ, అధిక రక్తపోటుకు దారి తీస్తాయి. దీర్ఘకాలంలో ఇది రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగటానికి దారితీస్తుంది. దీంతో గుండె సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి.



# అగార్కర్ అవుట్.. టీమిండియాకు కొత్త చీఫ్ సెలక్టర్!




టీమిండియా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ఈ నెల (సెప్టెంబరు)తో ముగియనుంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) అతడి కాంట్రాక్టును పొడిగించేందుకు సుముఖంగానే ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వన్డే ప్రపంచకప్2027 వరకు అగార్కర్‌నే సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కొనసాగించాలని బోర్డు భావించినట్లు తెలిసింది.
అయితే, అగార్కర్ మాత్రం చీఫ్ సెలక్టర్‌గా కొనసాగేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు తాజా సమాచారం. ఇదిలా ఉంటే.. వెస్టిండీస్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లకు బుధవారం భారత వన్డే, టీ20 జట్లను బీసీసీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా అగార్కర్‌కు ఇదే ఆఖరి సమావేశం అని సమాచారం.
రేసులో వారేఈ నేపథ్యంలో ఎన్డీటీవీ కథనం ఆసక్తికర విషయం వెల్లడించింది. చీఫ్ సెలక్టర్‌గా అగార్కర్ స్థానాన్ని భారత మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ పార్థివ్ పటేల్ లేదంటే.. మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా భర్తీ చేయనున్నట్లు బీసీసీఐ సన్నిహిత వర్గాలు పేర్కొనట్లు తెలిపింది.
కాగా పార్థివ్ పటేల్ (గుజరాత్), ప్రజ్ఞాన్ ఓజా ఇద్దరూ టీమిండియా తరపున సత్తా చాటడంతో పాటు మూడుసార్లు టైటిళ్లు గెలిచిన ఐపీఎల్ జట్లలో సభ్యులు కావడం విశేషం. ఇక ఒడిశాకు చెందిన ఓజా ఇప్పటికే సెలక్షన్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు.
ఘనమైన విజయాలుకాగా 2023 జూలైలో అగార్కర్ టీమిండియా చీఫ్ సెలక్టర్‌గా నియమితుడయ్యాడు. అతడి హయాంలో భారత జట్టు 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్‌కు చేరింది. ఇక 2024, 2026 టీ20 ప్రపంచకప్ టోర్నీల్లో చాంపియన్‌గా నిలిచింది. అదే విధంగా 2025లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గెలిచింది. అంతేకాదు గతేడాది ఆసియా కప్ టైటిల్‌ను కూడా సొంతం చేసుకుంది.
ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జూన్‌లోనే అగార్కర్ పదవీకాలం ముగిసినప్పటికీ బీసీసీఐ అతడిపై నమ్మకంతో అక్టోబరు 4 దాకా గడువు పొడిగించింది. అయితే, దిగ్గజ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలను వన్డే ప్రపంచకప్2027 దాకా కొనసాగించే విషయంలో అగార్కర్ బీసీసీఐ పెద్దల మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది.
అందుకే విభేదాలు!రోకో ప్రపంచకప్ ఆడే విషయంపై స్పష్టత ఇవ్వలేదంటూ అగార్కర్ ఇప్పటికే బహిరంగంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అదే సమయంలో రో కో మాత్రం తాము కచ్చితంగా వన్డే వరల్‌డ్‌కప్ ఆడతామనే సంకేతాలు ఇచ్చారు. ఇక రోహిత్ కోహ్లి అర్ధంతరంగా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడానికి కారణం కూడా అగార్కర్ వైఖరేనని గతంలో వార్తలు వచ్చాయి.
ఈ నేపథ్యంలో తలెత్తిన విభేదాల కారణంగా బీసీసీఐ పెద్దలు, అగార్కర్ మధ్య దూరం పెరిగిందని.. అందుకే అగార్కర్ ఇక తన పదవి నుంచి దిగిపోకతప్పలేదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# భారత హాకీకి యువ రక్తం అవసరం: శ్రీజేష్



**ప్రపంచకప్‌లో నిరాశాజనక ప్రదర్శన అనంతరం ఆసియా క్రీడలు భారత హాకీ జట్టుకు ఎంత కీలకం?**
ప్రపంచకప్, ఆసియా క్రీడలు పూర్తి భిన్నమైన టోర్నీలు. వరల్డ్ కప్‌లో ప్రపంచ అత్యుత్తమ జట్లు తలపడతాయి. ఆసియా క్రీడల్లో ఈ ఖండంలోని జట్లే తలపడతాయి. ఈ టోర్నీలో చాలా ఏళ్ల నుంచి మనదే ఆధిపత్యం. మరోసారి మన జట్టు ఇక్కడ స్వర్ణం సాధించడానికి పుష్కలంగా అవకాశాలున్నాయి. ప్రపంచకప్ వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకుని, బలంగా పుంజుకునేందుకు ప్రయత్నించాలి. ఆసియా నుంచి ప్రపంచ టాప్10లో ఉన్న జట్టు మనది మాత్రమే. కాబట్టి ఆధిపత్యం భారత్‌దే అని ఆశిస్తున్నా.
**ఈ క్రీడల్లో భారత్-పాక్ పోరుపై ఏమంటారు?**
పాకిస్థాన్ ఒకప్పుడు గొప్ప జట్టు. భారత్‌కు గట్టి పోటీ ఇచ్చేది. తీవ్ర ఒత్తిడికి గురి చేసేది. కానీ ఇప్పుడా జట్టు బాగా బలహీన పడింది. ఇద్దరు ముగ్గురు బలమైన ఆటగాళ్లు ఉన్నప్పటికీ.. జట్టుగా పాకిస్థాన్ సమష్టి ప్రదర్శన చేసే స్థితిలో లేదు. పాకిస్థాన్‌ను భారత్ ఇప్పుడు తేలికగా ఓడించగలదు. ఇండియాతో పాటు పాకిస్థాన్, చైనా, మలేషియా సెమీఫైనల్‌కు వచ్చే అవకాశముంది.
**భారత జట్టులో యువ ఆటగాళ్లకు మరింతగా చోటివ్వాల్సిన అవసరముందా?**
కచ్చితంగా. ఏ జట్టయినా ముందుకు సాగాలంటే సందర్భానుసారం యువ ఆటగాళ్లను ఎంచుకోవడం ఎంతో అవసరం. భవిష్యత్ దిశగా ఆలోచించే క్రమంలో 2024 ఒలింపిక్స్ అవ్వగానే 2028 మీద దృష్టిసారించాలి. ఆ తర్వాత 2032 గురించి ఆలోచించాలి. అలాంటపుడు యువ ఆటగాళ్లకు పెద్ద పీట వేయక తప్పదు. వారికి అవకాశాలిచ్చి అనుభవం సాధించేలా తీర్చిదిద్దాలి. గత కొన్నేళ్లుగా జూనియర్ సర్క్యూట్లో ఆడుతున్న యువ ఆటగాళ్లలో బాగా రాణిస్తున్న వారిని గుర్తించి సీనియర్ జట్టు వైపు నడిపించాలి.
**ప్రస్తుతం జట్టులోని కుర్రాళ్లకు ఆసియా క్రీడలు ఏ విధంగా ఉపయోగపడతాయి?**
ఆసియా క్రీడల్లో విజేతగా నిలిచే జట్టు ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది. కాబట్టి జట్టుకిది ముఖ్యమైన టోర్నీనే. ఒలింపిక్స్ కోణంలో చూస్తే యువ ఆటగాళ్లకు ఇది రిహార్సల్ లాంటి టోర్నీ. కానీ ఒలింపిక్స్‌తో పోలిస్తే ఆసియా క్రీడల ప్రమాణాలు తక్కువ. కాబట్టి ఇక్కడి నుంచి మరింత మెరుగుపడే ప్రయత్నం చేయాలి. జాతీయ జట్టులోకి వచ్చే కుర్రాళ్ల మూలాలు బలంగా ఉండాలి. పరిస్థితులకు తగ్గట్లు అన్వయించుకోవడం కీలకం. జూనియర్ జట్టుతో పోలిస్తే సీనియర్ స్థాయిలో ఆట వేగం వేరుగా ఉంటుంది. తీవ్రత పెరుగుతుంది. శ్రమ కూడా ఎక్కువే ఉంటుంది. వీటన్నింటికీ ఎంత వేగంగా అన్వయించుకుంటారన్నది కీలకం.
**ఆటలో భారత్ మెరుగుపడాల్సిన అంశాలేంటి?**
మన ఆటగాళ్లలో నైపుణ్యానికి కొదవ లేదు. కానీ దానికి మరింత మెరుగులు దిద్దుకోవాలి. ప్రపంచకప్‌లో భారత జట్టు ఎక్కువ గోల్స్ ఇచ్చేసింది. డిఫెన్స్‌లో మనం చాలా మెరుగుపడాలి. గోల్ అవకాశాలు కూడా చాలా వృథా అయ్యాయి. ఎటాకింగ్‌లోనూ మెరుగవ్వాల్సిన అవసరముంది. జట్టులో ఆటగాళ్ల మధ్య మంచి సమన్వయం ఉంది. కానీ అవతలి జట్లు ఎదురుదాడి చేసినపుడు నిలవలేకపోతున్నారు. ప్రత్యర్థి జట్లు కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యూహాలు అమలు చేస్తున్నాయి. వాటిని తిప్పికొట్టే ప్రణాళికలతో ఉండాలి.
**ఐరోపా జట్లను అందుకోవడానికి ఏం చేయాలి?**
మనది ఎక్కువగా డిఫెన్స్ మీద ఆధారపడే జట్టు. అవసరాన్ని బట్టి దూకుడు చూపిస్తారు. ఐరోపా జట్లు ఎటాకింగ్‌లో వేరే స్థాయిలో ఉంటాయి. దాన్ని అందుకోవడానికి ప్రయత్నించాలి. ఇప్పటికిప్పుడు అంతా మారిపోదు. దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగాలి. ఏదైనా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినపుడు దాని ఫలితాలు రావడానికి సమయం పడుతుంది. ఈ విషయంలో ఆటగాళ్లు, కోచ్‌లు బలంగా నిర్ణయించుకుని రంగంలోకి దిగాలి. బహుశా భారత జట్టులో ఇప్పటికే భవిష్యత్ దిశగా కొత్త ప్రణాళికలు అమలై ఉంటాయనుకుంటున్నా. ముమ్ముందు వాటి ఫలితాలు చూస్తాం.



# 100 గోల్స్.. చరిత్ర సృష్టించిన మెస్సీ

ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ మరో ఘనత సాధించాడు. ఇంటర్ మయామీ తరపున 100 గోల్స్ సాధించిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. కాంపియోన్స్ కప్ ఫైనల్లో గోల్ చేయడంతో ఈ మైలు రాయిని తాకాడు. మెస్సీ గోల్‌తో పాటు కాసెమిరో హెడర్‌తో మరో గోల్ చేయడంతో ఇంటర్ మయామీ 20తో క్రజ్ అజుల్‌పై విజయం సాధించి, ఐదోసారి కాంపియోన్స్ కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.
2023లో ఇంటర్ మయామీలో చేరిన మెస్సీ ఇప్పటివరకు నాలుగు సీజన్లలో కలిపి 115 మ్యాచ్‌లు ఆడి 100 గోల్స్ చేశాడు. 2023లో 11, 2024లో 23, 2025లో 43, 2026లో 23 గోల్స్ సాధించాడు. మెస్సీ కెప్టెన్‌గా ఇంటర్ మయామీకి అందించిన ఐదో టైటిల్ ఇది. ఓవరాల్‌గా మెస్సీ కెరీర్‌లో ఇది 49వ టైటిల్‌గా నిలిచింది. కాగా, ఈ ఏడాది ఆగస్ట్ 31న మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.

# 30 బంతుల్లోనే సెంచరీ..

**అభిషేక్ శర్మ రికార్డు**
అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న మూడో టీ20లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. 30 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. ఇందులో 96 పరుగులు .. 10 సిక్సులు, 9 ఫోర్ల రూపంలోనే రావడం గమనార్హం. మొత్తంగా అంతర్జాతీయ టీ20ల్లో ఇది మూడో ఫాస్టెస్ట్ సెంచరీ. తొలి రెండు స్థానాల్లో వరుసగా ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ (27 బంతులు), టర్కీకి చెందిన ముహమ్మద్ ఫహాద్ (29 బంతులు) ఉన్నారు. భారత జట్టు పరంగా చూస్తే ఇది ఫాస్టెస్ట్ సెంచరీ. అంతకు ముందు 2017లో రోహిత్ శర్మ శ్రీలంకతో మ్యాచ్‌లో 35 బంతుల్లో సెంచరీ చేశాడు.

**పవర్ ప్లే రికార్డు కూడా...**
అదే విధంగా టీ20 పవర్ ప్లేలో అత్యధిక పరుగుల రికార్డును అభిషేక్ శర్మ- సంజు శాంసన్ జోడీ బద్దలుకొట్టింది. తొలి ఆరు ఓవర్లలో 100 పరుగులు చేసింది. భారత టీ20 క్రికెట్‌లో ఇదే అత్యధికం. 2025లో ఇంగ్లాండ్‌పై చేసిన 95/1 ఇప్పటివరకు మన టాప్ పవర్ ప్లే స్కోర్. మొత్తంగా చూస్తే.. ఈ రోజు పవర్‌ప్లేలో సాధించిన స్కోరు మూడో అత్యధికం. తొలి రెండు స్థానాల్లో 113/0 (AUS vs SCO), 102/0 (SA vs WI) ఉన్నాయి.



# హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ మార్పుపై డయానా ఎడుల్జి సంచలన వ్యాఖ్యలు

హర్మన్‌ప్రీత్ కౌర్.. భారత మహిళా జట్టుకు తొలి ప్రపంచకప్ టైటిల్ అందించిన కెప్టెన్. సొంతగడ్డపై గతేడాది ఆమె సారథ్యంలో భారత్ వన్డే వరల్‌డ్‌కప్2025 ట్రోఫీని కైవసం చేసుకుంది.
తొలి ఐసీసీ టైటిల్‌నవీ ముంబైలోని డాక్టర్ డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన ఫైనల్లో హర్మన్ సేన.. సౌతాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి చాంపియన్‌గా అవతరించింది. ఈ క్రమంలో భారత మహిళా క్రికెట్ జట్టు తొలిసారి ప్రపంచకప్ సొంతం చేసుకోగా.. హర్మన్‌ప్రీత్ కౌర్ పేరు సువర్ణాక్షరాలతో చరిత్రలో నిలిచిపోయింది.



అయితే, టీ20 ప్రపంచకప్2026 టోర్నీలో మాత్రం భారత జట్టు సత్తా చాటలేకపోయింది. ఇంగ్లండ్ వేదికగా జరిగిన ఈ టోర్నీలో సెమీ ఫైనల్ చేరకుండానే ఇంటిబాటపట్టింది. అయితే, ఇటీవల ఆసియా టీ20 కప్2026 టోర్నీలో మాత్రం హర్మన్ జట్టును విజేతగా నిలపగలిగింది.
కెప్టెన్ మార్పు అనివార్యంఈ పరిణామాల నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ కౌర్‌ను ఉద్దేశించి భారత మహిళా క్రికెట్ దిగ్గజం డయానా ఎడుల్జి తాజాగా చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. వన్డే వరల్‌డ్‌కప్2029 టోర్నీకి సన్నద్ధమయ్యే క్రమంలో కెప్టెన్ మార్పు అనివార్యమని డయానా అభిప్రాయపడింది. 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీకి రాజీనామా చేసి.. వైస్ కెప్టెన్, దిగ్గజ ఓపెనర్ 30 ఏళ్ల స్మృతి మంధానకు పగ్గాలు ఇవ్వాలని సూచించింది.అప్పటికి 40 ఏళ్లు..దయచేసి కెప్టెన్‌గా దిగిపో!''స్మృతి మంధాన దీర్ఘకాలంగా జట్టుతో కొనసాగుతోంది.

# పృథ్వీ షా - ఆకృతి అగర్వాల్ నిశ్చితార్థం రద్దు



భారత యువ క్రికెటర్ పృథ్వీ షా మరోసారి వార్తల్లో నిలిచాడు. నటి ఆకృతి అగర్వాల్‌తో అతడి నిశ్చితార్థం రద్దయ్యింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఆకృతి ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టింది. మరోవైపు, ఆమె ఈ పోస్ట్ పెట్టిన కాసేపటికే పృథ్వీషా తన ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు మొత్తం పోస్టులను తొలగించడం గమనార్హం.
టాలీవుడ్ నటి ఆకృతి అగర్వాల్‌తో మార్చి 8న పృథ్వీ షా ఎంగేజ్‌మెంట్జరిగింది. అందుకు సంబంధించిన ఫొటోలు వీరిద్దరూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే, ఈ నిశ్చితార్థాన్ని రద్దు చేసుకుంటున్నట్లు తాజాగా ఆకృతి ప్రకటించింది. ''భవిష్యత్తుకు సంబంధించి మా ఇద్దరి లక్ష్యాలు, పరిస్థితులు విభిన్నంగా ఉన్నాయి. మాకు ఒకరిమీద ఒకరికి ప్రేమ ఉన్నప్పటికీ.. మా దారులు వేరని, ఇక కలిసి ప్రయాణించలేమని అర్థమైంది. బాధ్యతలు, మా చుట్టూ ఉన్న పరిస్థితుల దృష్ట్యా మేం విడి విడిగా ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాం. ఈ సమయంలో మా గోప్యతను అందరూ గౌరవించాలని ఆకాంక్షిస్తున్నా. మా నిర్ణయం వెనుక ఎలాంటి ఊహాగానాలు, అసత్య ప్రచారాలు చేయొద్దని కోరుతున్నా'' అని ఆకృతి అగర్వాల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చింది. ఈమె ప్రకటన వెలువడిన కాసేపటికే.. పృథ్వీ షా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులన్నీ అదృశ్యమయ్యాయి. ఒక్క 2016 నాటి పోస్ట్ మినహా అన్నింటినీ తొలగించాడు. ''నిన్ను నువ్వు పరిచయం చేసుకోవాల్సిన అవసరం లేనంత వరకు పని చేయి'' అనే అర్థంతో ఉన్న పోస్ట్ మాత్రమే ఉంచాడు. అయితే, నిశ్చితార్థం రద్దు గురించి మాత్రం పృథ్వీషా ఇంకా స్పందించలేదు.
ఈ ఏడాది జులైలో వీరి బ్రేకప్ గురించి వార్తలు వచ్చాయి. ''నేను మోసపోయా. అతడితో కలిసి జీవితంలో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాక ఇదంతా నమ్మలేకపోతున్నా. అతడి గురించి సామాజిక మాధ్యమాల్లో చూసిందంతా నిజమే. వదంతులన్నీ వాస్తవమే'' అంటూ ఆ మధ్య ఆకృతి ఓ పోస్ట్ చేసింది. అందులో పృథ్వీషా పేరును ఆమె ప్రస్తావించనప్పటికీ.. వీరిద్దరి మధ్య బ్రేకప్ జరిగినట్లు ప్రచారం జరిగింది. అయితే, నాడు ఆ వార్తలను ఆకృతి ఖండించింది. తన స్నేహితులను ఉద్దేశించే ఆ పోస్ట్ చేశానని, కాబోయే భర్తతో తాను చాలా సంతోషంగా ఉన్నానని నాడు ఆమె చెప్పింది. ఇప్పుడు రెండు నెలలు తిరగకుండానే.. నిశ్చితార్థాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ఆమె ప్రకటించడం గమనార్హం. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పాపులర్ అయిన ఆకృతి.. ఈ ఏడాది విడుదలైన 'త్రిముఖ' సినిమాలో నటించింది.

# నేను రోబోను కాను

తన కెరీర్ గురించి బయటి వాళ్లు ఎవరేమన్నా పట్టించుకోనని టీమ్ఇండియా బ్యాటర్ సంజు శాంసన్ అన్నాడు. ''కొన్నిసార్లు వైఫై ఆన్ చేస్తా. మాజీ ఆటగాళ్ల వ్యాఖ్యలు చదువుతా. ఎవరి అభిప్రాయాలు వాళ్లు చెబుతారు. అది మామూలే. వాళ్లు నా గురించి సానుకూల వ్యాఖ్యలు చేయొచ్చు లేదా వ్యతిరేక వ్యాఖ్యలు చేయొచ్చు. నేను పరిణతి సాధించా. ఆ వ్యాఖ్యలు చూసి ఎలా వ్యవహరించాలో నాకు తెలుసు'' అని శాంసన్ అన్నాడు. ''కొన్నిసార్లు బాధనిపిస్తుంది. నేను రోబోను కాదు. ఆ వ్యాఖ్యలు కచ్చితంగా నాపై ప్రభావం చూపిస్తాయి. కానీ నాకు నేను సర్దిచెప్పుకొంటా'' అని చెప్పాడు. బయటివాళ్ల మాటలను పట్టించుకుంటే తాను సరిగా బ్యాటింగ్ చేయలేనని శాంసన్ అన్నాడు. తన అంతర్జాతీయ కెరీర్ బాగుందని, ప్రపంచకప్ తనకు ఎంతో ఉపయోగపడిందని అతడు చెప్పాడు. ఓపెనింగ్ స్థానానికి వైభవ్ నుంచి శాంసన్‌కు గట్టి పోటీ ఉన్న సంగతి తెలిసిందే.



'ది ప్యారడైజ్' మూవీ

# సరికొత్త రికార్డులు!

### 800లకు పైగా ప్రీమియర్ షోలు

టాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్' చిత్రంపై ట్రేడ్ వర్గాలతో పాటు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నేచురల్ స్టార్ నాని కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా, సినిమా విడుదలకు ముందే సరికొత్త ట్రెండ్‌కు తెరలేపారు. సెప్టెంబర్ 23న తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఏకంగా 800లకు పైగా భారీ ప్రీమియర్ షోలను ప్రదర్శించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు, టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇందులో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త రగ్గడ్ మరియు మాస్ లుక్‌లో కనిపించనున్నారు. సెప్టెంబర్ 24 నుంచి థియేటర్లలో 'జడల జమాన' అధికారికంగా ప్రారంభం కానుండటంతో నాని అభిమానులు, మాస్ ఆడియెన్స్ ఈ సినిమా కోసం అత్యుత్సాహంతో ఎదురుచూస్తున్నారు. ట్రెండింగ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.



# పవర్‌ఫుల్ పోలీస్ ప్రేమ్‌రాజ్




అగ్ర కథానాయకుడు సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'సీన్'. జితు మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఝుగారం స్టూడియోస్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై జ్యోతిక, సూర్య నిర్మిస్తున్నారు. దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో డీఎస్పీ ప్రేమ్‌రాజ్‌గా శక్తివంతమైన పాత్రలో కనిపించారు సూర్య. యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కమాండింగ్ బాడీ లాంగ్వేజ్, పంచ్‌లతో కూడిన సంభాషణలతో సూర్య తనదైన మేనరిజమ్స్ తో ఆకట్టుకున్నారు. నజ్రియా నజీమ్, ఆనంద్‌రాజ్, లాల్, రాజ్‌ప్రియాన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# చీరలో తమన్నా గ్లామర్ ట్రీట్..

## ట్రైలర్ లాంచ్‌లో అదుర్స్!

తమన్నా భాటియా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను కట్టిపడేసింది. తన రాబోయే చిత్రం 'ది వ్యాన్' ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి హాజరైన ఈ మిల్కీ బ్యూటీ.. పసుపు రంగు చీరలో మెరిసి ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

బ్రైట్ ఎల్లో కలర్ చీరకు మల్టీకలర్ కలంకారీ తరహా బోర్డర్‌ను జోడించింది. దీనికి ఆఫ్‌షోల్డర్ బ్లౌజ్‌ను జతచేసి ట్రెడిషనల్ లుక్‌కు మోడ్రన్ టచ్ ఇచ్చింది. చెవులకు బంగారు జుంకాలు, చేతులకు వరుసగా గాజులు ధరించి తన అందాన్ని మరింత పెంచుకుంది. వదులుగా వదిలేసిన వేవీ హెయిర్, సాఫ్ట్ మేకప్‌తో తమన్నా లుక్ పండుగ వాతావరణాన్ని తలపించేలా కనిపించింది.

ఈ కార్యక్రమంలో తమన్నా, ఆమె సహనటుడు సిద్ధార్థ్ మల్హోత్రా మధ్య జరిగిన సరదా సంభాషణ కూడా ఆకట్టుకుంది. 'ది వ్యాన్'లో తొలిసారి కలిసి నటిస్తున్న వీరిద్దరూ ఒకరిపై ఒకరు సరదాగా ప్రశంసలు కురిపించుకున్నారు. ఈ సందర్భంగా వారి మధ్య జరిగిన సరదా సన్నివేశాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల దృష్టిని ఆకర్షించాయి.

దీపక్ మిశ్రా దర్శకత్వంలో తెరకెక్కిన 'ది వ్యాన్' ఫోక్‌లోర్‌ఫ్యాంటసీ డ్రామాగా రూపొందుతోంది. ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ, మనీష్ పాల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సెప్టెంబర్ 25న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.



## పాయల్ రాజ్‌పుత్

# గ్లామరస్ లుక్

పాయల్ రాజ్‌పుత్ తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో మరోసారి సందడి చేస్తోంది. గోల్డ్ సీక్విన్డ్ బస్టియర్, లైట్ బ్లూ ఫ్లోయీ స్కర్ట్‌లో దర్శనమిచ్చిన ఈ భామ.. స్టైలిష్ పోజులతో అభిమానులను ఆకట్టుకుంది. మెరిసే గోల్డ్ టాప్‌కు లైట్ బ్లూ స్కర్ట్‌ను జోడించి గ్లామరస్ లుక్‌ను సొంతం చేసుకుంది.

మల్టీకలర్ జెమ్‌స్టోన్ నెక్లెస్, దానికి మ్యాచింగ్ కఫ్ బ్రేస్‌లెట్‌తో తన లుక్‌కు మరింత ప్రత్యేకత తీసుకొచ్చింది. వేవీ హెయిర్, బోల్డ్ మేకప్‌తో పాయల్ లుక్ ఓల్డ్ హాలీవుడ్ గ్లామర్‌ను తలపించింది. మరో ఫొటోలో పాతకాలం నాటి టెలిఫోన్‌తో సరదాగా పోజిచ్చిన పాయల్.. తన ఎక్స్‌ప్రెసివ్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఆకట్టుకుంది. అదే గ్లామరస్ అవుట్‌ఫిట్‌లో విభిన్న భంగిమల్లో ఫొటోలకు పోజులిచ్చిన ఆమె.. తన కాన్ఫిడెన్స్, స్టైలింగ్‌తో అభిమానులను ఫిదా చేసింది. ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ప్రశంసలతో కామెంట్లు చేస్తున్నారు.

ఇక సినిమాల విషయానికి వస్తే.. పాయల్ రాజ్‌పుత్ చివరిగా 'ది గ్రేట్ పంజాబ్ రాబరీ' అనే పంజాబీ హీస్ట్ థ్రిల్లర్‌లో నటించింది. రాజ్ కుంద్రా, గార్విత సధ్వానీ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సాధారణ స్థాయి ఫలితాన్ని అందుకుంది

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com